
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 6 మార్చి 2025



అధ్యక్షా..

వీఎస్‌యూలో ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీలు ఏర్పాటు చేయండి

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



నెల్లూరు (హరనాథపురం) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. బుధవారం ఆమె శాసనసభలో మాట్లాడుతూ వీఎస్‌యూలో టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాలలో ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు 2వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ విశ్వవిద్యాలయంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రశాంతిరెడ్డి విజ్ఞప్తులకు మంత్రి లోకేష్ సమాధాన మిస్తూ త్వరలోనే ఉన్నత విద్యా రంగంలో సమూల మార్పులు చేసి, సంస్కరణలు తీసుకొస్తామన్నారు. యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పన, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేస్తామని హామీ ఇచ్చారు.

సాగునీటి రంగానికి నిధులు కేటాయించండి

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరి : సాగునీటి రంగానికి నిధులు కేటాయించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీ సమావేశంలో కోరారు. తన నియోజకవర్గంలో ఉన్న ఏకైక జలాశయం పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాశయానికి ప్రత్యేక ఖాతా కూడా లేదని, ఖాతా ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే నియోజకవర్గంలో 149 చెరువుల కింద సుమారు 55 వేల ఎకరాల ఆయకట్టు ఉందనీ, ఏళ్ల తరబడి చెరువులు, తూములు, కాలువల మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారుతున్నాయని చెప్పారు. చెరువుల అభివృద్ధికి అత్యవసర నిధులు మంజూరుచేస్తే తూములు, కాలువలకు మరమ్మతులు చేయించి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పాతవారికి కొత్త స్కీమ్‌లో అవకాశం ఇవ్వాలి

- కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



కావలి : పాతహౌసింగ్ స్కీమ్ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం కొత్త హౌసింగ్ స్కీమ్‌లో అవకాశం కల్పించి, ఇళ్ల నిర్మించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.2.50 లక్షలు మంజూరు చేస్తూ, ఎస్టీలకు రూ.75,000, ఎస్సీ, బీసీలకు రూ.50.000లను అదనంగా అందచేస్తున్నదన్నారు. ఇళ్ల నిర్మించుకునే వారికి ఈ పథకం అనుకూలంగా ఉన్నా, గత ప్రభుత్వం ఇళ్ల నిర్మించకుండానే పలువురి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు టార్గెట్లు చూపించిందన్నారు. అయితే ఈ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మించుకోవాలనుకునే వారికి ఆన్‌లైన్‌లో ఇళ్ల నిర్మాణం ప్రారంభమైనట్లు, వారిని అనర్హులుగా చూపిస్తోందన్నారు. గతంలో ఇళ్లు మంజూరయిన వారందరికీ ఈ కొత్త పథకంలో ఇళ్లు మంజూరు అయ్యేలా చూస్తే పేదలంతా ఇళ్ల నిర్మాణాలు చేపడతారని చెప్పారు.

కలుజులపై వంతెనలు నిర్మించండి

- రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ : తన నియోజకవర్గ పరిధిలోని పొట్టేపాళెం, ములుముడి ప్రాంతాలలో చెరువు కలుజులపై వంతెనలు నిర్మించి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పొట్టేపాళెం కలుజు వద్ద నెలకొన్న సమస్య నగం జిల్లాతో ముడిపడి ఉన్న సమస్య అన్నారు. ఇక్కడ వంతెన లేక ప్రజలు అవస్థలుపడుతున్నారని తెలిపారు. రూ.7 కోట్లు కేటాయిస్తే ఈ రెండు కలుజులపై వంతెనలు నిర్మించవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం తన అభ్యర్థనను ఆచరణలోకి తీసుకోవాలని కోరారు.

నేడు
ఏపీఎస్‌సీఎస్‌సీఎల్ ఎండీ రాక

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్, ఎండీ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ గురువారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆశాఖ అధికారులతో సమీక్ష జరిపి, బియ్యం సేకరణ తదితర అంశాల మీద వివరాలు సేకరిస్తారని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

భానుడి ఎఫెక్ట్!

భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 11 గంటలకే ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. మండుతున్న ఎండలకు మధ్యాహ్నం 12 గంటలకల్లా నెల్లూరు నగరంలోని ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. మార్చిలోనే ఎండలు ఈవిధంగా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. బుధవారం కేవీఆర్ పెట్రోలు బంకు, ఆర్టీసీ కూడలి, గాంధీబొమ్మ కూడలి తదితర కూడళ్లు బోసిపోయాయి.

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



నిత్యం రద్దీగా ఉండే కేవీఆర్ పెట్రోలు బంకు కూడలి బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకే ఇలా..



బోసిపోయిన ఆర్టీసీ కూడలి ప్రాంతం

'ఉపాధి'లో అవకతవకలకు **పాల్పడితే చర్యలు**



పెరిగిన నిమ్మ ధర.. **బస్తా రూ.8 వేలు**

ప్రసన్నుడి హుండీ ఆదాయం

8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురువారం) : 6.20
సహరి (శుక్రవారం) : 5.02



పురపాలక సంఘాల్లో ఆస్తి, నీటి పన్ను వసూళ లక్ష్యం గడువు ముంచుకొస్తోంది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇక 25రోజులు మాత్రమే ఉంది. ఈలోపు వంద శాతం పన్ను వసూలు చేయాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో మున్సిపల్ అధికారులు ప్రత్యక్ష చర్యలకు దిగుతున్నారు. బకాయిదారులకు జప్తు నోటీసులు జారీ చేయడంతోపాటు మున్సిపల్ సిబ్బంది ఇంటి కొళాయి కనెక్షన్ తొలగించే దిశగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

లక్ష్యం.. చేరేదెలా!?

- ఈ నెలాఖరుతో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- మున్సిపాలిటీల్లో వసూళ్లుకాని పన్నులు
- ఏంచేయాలో దిక్కుతోచక అధికారుల మల్లగుల్లాలు

నెల్లూరు(సిటీ) : కార్పొరేషన్ పరిధిలో 1,43,633 అసెస్‌మెంట్ల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.80.36 కోట్ల పాత ఇంటి పన్ను బకాయిలు, ఈ ఏడాది పన్ను మరో రూ.69.82 కోట్లు కలిపి రూ.150.18 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఈ మొత్తం వసూళ్లకు నూతన బృందాన్ని రంగంలోకి దింపినా ఆశించిన ఫలితాలు రావడంలేదు. రూ.69.82 కోట్లలో రెవెన్యూ విభాగం రూ.9.95 కోట్లు మాత్రమే వసూలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దీన్నిబట్టి బకాయిల వసూళ్లకు ఆర్‌ఐలు పూర్తిగా ముఖం చాటే శారన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది. పన్ను కట్టకుంటే కరెంట్, తాగునీటి కనెక్షన్లు కట్ చేస్తామంటూ సామాన్యులను బెదిరిస్తున్న అధికారులు, రూ. కోట్లు బకాయిలు ఉన్న ప్రభుత్వ భవనాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

● తక్కువ వ్యవధిలో సాధ్యమేనా?

ఈ ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను రూ.150.18 కోట్లు వసూళ్లు చేయాలన్నది రెవెన్యూ విభాగం పెట్టుకున్న లక్ష్యం. గడిచిన 11 నెలల్లో రూ. 54.48 కోట్లు మాత్రమే వసూలు చేసి సరిపెట్టుకున్నారు. మిగిలిన 25 రోజుల్లో రూ.95.6 కోట్లు వసూళ్లు చేయాలి. ఇది సాధ్యమేనా!? అనేది చర్చనీయాంశంగా మారింది.

● మంత్రి చెప్పినా..

పన్ను వసూళ్లలో అలసత్వం వద్దని హెచ్చరించిన పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఆస్తి పన్ను రూ.150.18 కోట్లు, నీటి పన్ను రూ.55.72 కోట్లలో కనీసం రూ.100 కోట్లు ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు వసూళ్లు చేయాలని ఆదేశించారు. మంత్రి చెప్పినట్లు ఈ 25 రోజుల్లో వంద కోట్లు వసూలు చేస్తారా... అనేది ప్రశ్నార్థకంగా మారింది.

మిగిలిన మున్సిపాలిటీల్లో ఇలా..

● కందుకూరు : ఈ మున్సిపాలిటీలో వార్షిక పన్ను రూ.4.8 కోట్లు ఉండగా దీర్ఘకాల బకాయిలతో కలిపి రూ.9.5 కోట్లు ఈ ఏడాది వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో ఇప్పటివరకు రూ.4.2కోట్లు వసూళ్లయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూలు మరో కోటి రూపాయలు వరకు బకాయి ఉంది. ఈ నెలాఖరులోగా పన్నులరూపంలో మున్సిపాలిటీకి రూ.6కోట్ల వరకు రాబడి ఉంటుందని అంచనా అధికారులు వేస్తున్నారు. దీర్ఘకాలిక బకాయిలలో అత్యధికం మున్సిపాలిటీలో గతంలో ఉండి, అనంతరం పంచాయతీలుగా ఏర్పడి తిరిగి మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలకు సంబంధించిన బకాయిలుండగా వాటిని రద్దు చేయాలని ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో పెండింగ్ బకాయిలు అధికంగా ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు.

● కావలి : ఈ పురపాలక సంఘం పరిధిలో పాత, కొత్త బకాయిలు మొత్తం రూ.17.5 కోట్లు వసూలు కావాల్సి ఉండగా కేవలం 7 కోట్ల రూపాయలు మాత్రమే వసూళ్లయ్యింది. ఇందులో ఈ ఏడాది ఆస్తి పన్ను రూ.9 కోట్లకు ఆరు కోట్లే వసూళ్లు చేశారు. మిగిలిన రూ.3 కోట్లను ఈ నెలఖరుకు వసూలు చేసేలా లక్ష్యం పెట్టుకున్నట్లు కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. 11 నెలల్లో రూ.6 కోట్లు మాత్రమే వసూలు చేయగా 25 రోజుల్లో రూ.3కోట్లు ఎలా సాధ్యపడుతుందనే చర్చ జరుగుతోంది. కరెంట్ డిమాండ్ కాకుండా మరో రూ.7కోట్లు అరియర్స్ పన్నులు వసూలు చేయాల్సి ఉంది. వీటితో కలుపుకుంటే మొత్తం రూ.10 కోట్ల వరకు పన్నులు వసూళ్ల చేయాల్సి ఉంది. అయితే అరియర్స్‌లో సుమారు రూ.4కోట్ల వరకు ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ఉన్నాయి. విశ్వోదయ సంస్థల భవనాలకు సంబంధించి రూ.2.5 కోట్లు అరియర్స్ ఉండగా అది కోర్టులో కేసు నడుస్తోంది. ఇక ప్రైవేట్ ఆస్తులకు సంబంధించి మరో రూ.10 లక్షలు కోర్టు పరిధిలో ఉంది.

● ఆత్మకూరు : మున్సిపాలిటీలో ఆస్తి, నీటి పన్ను రూ.4.27 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ.2.75 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ.1.52 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఈ నెలాఖరుకు పూర్తిస్థాయి పన్నుల వసూళ్లకు అధికారులు రంగంలోకి దిగారు. పన్నులు వసూళ్లయితే మున్సిపల్ సిబ్బందికి వేతనాలు, విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే సకాలంలో పన్నులు వసూళ్లు కాకపోవడంతో జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఆత్మకూరు మున్సిపాలిటీ కొట్టుమిట్టాడుతోంది. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ ప్రగతి సహకరించాలని అధికారులు మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీలో ఏడాదికి అరియర్స్‌తో కలిపి అన్ని రకాల పన్నులు రూ.4.30 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ.2.17 కోట్లు వసూలు కాగా వసూలు అయినట్లు కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఇంకా రూ.2.13 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూ.25 లక్షలు అదనంగా వసూలైనట్లు కమిషనర్ తెలిపారు.

గృహ నిర్మాణ శాఖలో
భోక్తలపై చర్యలు

- ఇసుక తినేసినట్టు గుర్తించిన విజిలెన్స్
- ఓ ఏఈపై సస్పెన్షన్ వేటు
- రిటైర్డ్ ఈఈతో సహా పలువురికి షోకాజ్ నోటీసులు

నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో గృహ నిర్మాణ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు ప్రారంభమయ్యాయి. కొంతమంది అధికారులు, కాంట్రాక్టర్లపై ఫిర్యాదులు అందడంతో కూటమి ప్రభుత్వం విజిలెన్సు విచారణకు ఆదేశించింది. దీంతో విచారణ చేపట్టిన అధికారులు నెల్లూరు రూరల్ నియోజక వర్గంలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.34.5 లక్షల మేర ఇసుక దోపిడీ జరిగినట్లు గురించారు. జగనన్న ఇళ్ల పేరుతో తోలిన ఇసుక మధ్యలోనే మాయమైపోయింది. ఈమేరకు నివేదికను హౌసింగ్ ఎండీకి పంపగా, సిటీ ఏఈగా పనిచేస్తున్న మధుసూదన్‌రావును సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నెల్లూరుతోపాటు మనుబోలు జగనన్న లేఅవుట్లలోనూ ఇసుక అక్రమాలు జరిగినట్లు విజిలెన్సు విచారణలో తేలింది. మనుబోలు మండలంలో దాదాపు రూ.16లక్షల విలువైన ఇసుక దోపిడీకి గురైనట్లు గుర్తించారు. దీంతో బాధ్యులైన రిటైర్డ్ ఈఈ నాగరాజు, గతంలో డీఈగా విధులు నిర్వహించి ప్రస్తుతం తిరుపతి ఇన్‌చార్జి పీడీగా పనిచేస్తున్న దయాకర్, గతంలో మనుబోలు ఏఈలుగా పని చేసిన రవికుమార్, సుబ్రహ్మణ్యంలకు షోకాజ్ నోటీసులు జారీచేసి అక్రమాలపై సమాధానం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మిగిలిన అధికారుల్లో గుబులు మొదలైంది.

యువ శాస్త్రవేత్తలకు
ఇస్రో ఆహ్వానం

- పాఠశాల స్థాయిలోనే అంతరిక్ష విజ్ఞానం
- 'యువికా' పేరుతో 14 రోజుల శిక్షణ
- 23 వరకు దరఖాస్తుల ఆహ్వానం



నెల్లూరు (విద్య), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఇస్రో సువర్ణావకాశం కల్పిస్తోంది. అంతరిక్ష పరిజ్ఞానం తెలుసుకునేందుకు, ఉపగ్రహాల ప్రయోగాలను చూపేందుకు, శాస్త్రవేత్తలతో మాట్లాడేందుకు ఇస్రో యువ విజ్ఞాన కార్యక్రమానికి (యువికా) ఆహ్వానం పలుకుతోంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవగా, ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఏడు ఇస్రో కేంద్రాల్లో రెండు వారాల రెసిడెన్షియల్ కోర్సుగా యువికా కార్యక్రమం నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత ఎంపిక చేసిన జాబితాను ఏప్రిల్ 7వ తేదీన విడుదల చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు మే 19 నుంచి 30వ తేదీ వరకు యువికా కార్యక్రమం ఉంటుంది. 14 రోజులపాటు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లలో విద్యార్థులు పర్యటిస్తారు. అక్కడ వివిధ అంశాలపై శిక్షణ, శాస్త్రవేత్తలతో ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉంటుంది. అంతరిక్షంలో సాధిస్తున్న ప్రగతి సవాళ్లు, శాస్త్రవేత్తలు కావాలంటే ఏం చేయాలన్న అంశాలతోపాటు ప్రయోగశాలల సందర్శన, నిపుణులతో చర్చాగోష్ఠి వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

● అర్హతలు ఇవే..

'యువికా' కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు కొన్ని అర్హతలు నిర్ణయించారు. 8వతరగతిలో ఉత్తమ విద్యా ప్రమాణాలు ఉండటంతోపాటు కనీసం 50శాతం మార్కులు ఉండాలి. గడిచిన మూడు సంవత్సరాల్లో వారు చదివే పాఠశాల జిల్లా లేదా రాష్ట్రస్థాయిల్లో ఎక్కువ స్థాయిలో సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటారు. అదేవిధం గా క్రీడాపోటీల ర్యాంకింగ్‌లు, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌లలో సభ్యులుగా ఉన్న విద్యార్థులకు 5శాతం వెయిటేజి, గ్రామీణ పాఠశాలల విద్యార్థులకు 15శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు.

● ఖర్చులన్నీ ఇస్రోవే..

ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, వసతి, బోర్డింగ్, కోర్స్ సామగ్రికి సంబంధించిన ఖర్చులనీ ఇస్రోనే భరిస్తుంది. విద్యార్థులకు అంతరిక్ష సాంకేతికత, అంతరిక్ష శాస్త్రం, అంతరిక్ష విజ్ఞానం అందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ కెరీర్‌లలో వారిని ప్రోత్సహించేందుకు 'యంగ్‌గా వారిని పట్టుకోండి' అనే థీమ్‌తో జరిగే ఈ కార్యక్రమానికి విద్యార్థులు టీటీటీ.జీటుగా.జౌటి.జీ వెబ్‌సైట్‌లో ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు పూర్తి సమాచారం అందచేశామని విద్యాశాఖాధికారులు తెలిపారు.

- ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో నిబంధనల ఉల్లంఘన
- నెట్‌వర్క్ ఆసుపత్రుల తీరుపై విమర్శలు
- 12 ఆసుపత్రుల గుర్తింపు.. కలెక్టర్ సీరియస్
- పేదలకు డబ్బు తిరిగివ్వాలని ఆదేశం

పరీక్షలు చేసి..
పైసలు కాజేశారు!



నెల్లూరు (వైద్యం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎన్టీఆర్ వైద్య సేవా పథకం నిబంధనలు ఖచ్చితంగా నెట్‌వర్క్ ఆసుపత్రు లు పాటించాలి. అయితే జిల్లా లోని ఆ నెట్‌వర్క్ పరిధిలో ఉన్న ఆసుపత్రులలో చాలావరకు నిబంధనలు గాలికొదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా అది కాగితాలకే పరిమితం అవుతోంది. చాలా నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఎన్టీఆర్ వైద్యసేవలు సరిగ్గా అందడం లేదని గుర్తించిన అధికారులు అలాంటివాటిపై కొరడా ఝుళిపించారు. 12 నెట్‌వర్క్ ఆసుపత్రులు నిబంధనలు పాటించకుండా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తిం చారు. ఆయా నెట్‌వర్క్ ఆసుపత్రుల నుంచి రోగులకు రావాల్సిన నగదు తిరిగి చెల్లించేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కోఆర్డినేటర్ సుధీర్‌కు మార్ చర్యలు తీసుకుంటున్నారు. మరోసారి తప్పు చేస్తే రోగులకు చెల్లించాల్సిన బకాయిలలో 10 రెట్లు వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

● ట్రస్ట్ డబ్బులు చెల్లిస్తున్నా..

జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ పరిధి లో 71 ఆసుపత్రులు ఉండగా, 3,225 వ్యాధులకు వైద్యసేవలు అందిస్తున్నారు. వీటిలో 30 ఆసుపత్రులలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు చేస్తున్నారు. మరో 3 ప్రభుత్వ ఆసుపత్రులలోపాటు 38 డెంటల్ ఆసుపత్రులు ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ కింద ఉన్నాయి. అయితే, చాలా ఆసుపత్రులలో ట్రస్ట్ నిబంధనలు అమలు కావడం లేదు. రోగులు నెట్‌వర్క్ ఆసుపత్రులకు రాగానే ముందస్తు పరీక్షల పేరుతో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చును కొన్ని సందర్భాలలో రోగులే ముందస్తు చెల్లించాల్సి ఉంటోంది. ఆ తర్వాత ఆయా పరీక్షలకు అయ్యే ఖర్చును ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో చేర్చి తిరిగి రోగులకు చెల్లిస్తారు. అయితే 12 ఆసుపత్రుల నిర్వాహకులు ఆ పరీక్షల నగదును కూడా తమ ఖాతాలో వేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఆఖరుకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సైతం రోగుల నగదును తిరిగి ఇవ్వలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రోగుల నుంచి వేల రూపాయలు వసూలు చేసిన నెట్‌వర్క్ ఆసుపత్రులపై కలెక్టర్ ఆనంద్ మంగళవారం వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ వ్యవహారంపై అధికారులను నిలదీసి, వెంటనే ఆ నగదును రికవరీ చేసి రోగులకు అందజేయాలని సూచించారు.

రోగులకు తిరిగి చెల్లించేలా చర్యలు

వివిధ రకాల పరీక్షల పేరుతో వసూలు చేసిన నగదును తిరిగి రోగులకు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టర్ ఆనంద్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు హెచ్చరిక జారీ చేస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే వెంటనే మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. నెట్‌వర్క్ ఆసుపత్రులపై నిఘా విస్తృతం చేస్తాం. రెండవసారి తప్పు చేస్తే ఆయా నెట్‌వర్క్ ఆసుపత్రుల నుంచి 10 రెట్ల నగదు వసూలు చేస్తాం.



- డాక్టర్ సుధీర్‌కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

ప్రతి మహిళ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఉదయగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ సమాజంలో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఐసీడీఎస్ సీడీపీవో సునీత పేర్కొన్నారు. బుధవారం స్థానిక సెయింట్ మేరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షాను, తేజస్విని, రత్న, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

● ఎస్ఈ విజయన్



విద్యుత్ సబ్ స్టేషన్‌లో అధికారులతో ఎస్ఈ విజయన్

ఆత్మకూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు రూరల్ మండలంలో ఆర్‌డీఎస్ఎస్ పథకంతో వాసిలి, కరటంపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఐదు కొత్త ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరిగిందని ఎస్ఈ విజయన్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని వాసిలి, కరటంపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. అనంతరం విద్యుత్ సరఫరాలో ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేస్తునట్లు తెలిపారు. అందులో భాగంగానే వాసిలి, కరటంపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో ఐదు ఫీడర్ల ద్వారా వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీఈఈలు ఐ శ్రీనివాసులు, పరంధామయ్య, ఏడీఈలు కృష్ణారెడ్డి, నాయక్, ఏఈఈలు హరి కృష్ణ, సుబ్బారెడ్డి, పి సునీత, షేక్ జమీల బేగం, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిలలో 57.640 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 57.640 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 1,950, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ప్రారంభానికి నోచుకోని గోదాములు

● ధాన్యం నిల్వ చేసుకునేందుకు రైతుల అవస్థలు



గంగిరెడ్డిపల్లి వద్ద అలంకారప్రాయంగా ఉన్న గోదాము

ఉదయగిరి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన గోదాములు ప్రారంభానికి నోచుకోక ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఒక్కో గోదామును రూ. 40లక్షల వ్యయంతో రైతులకు అనుకూలంగా ఉండేలా గంగిరెడ్డిపల్లి, వరికుంటపాడు గ్రామాల సమీపంలో నిర్మించి ఏళ్లు గడుస్తున్నప్పటికీ పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. ఆ గోదాముల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకోవడంతో పాటు ఆరబోసుకునే వెసులుబాటు ఉంది. ప్రారంభానికి నోచుకోకపోవడంతో రైతులు ధాన్యాన్ని నివాసాలు, రహదారుల సమీపంలో ఆరబోసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎలాంటి అవకాశం లేనివారు పొలాల్లోనే దళారులకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదాములను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర



ఆత్మకూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు. మండలంలోని కరటంపాడు, బోయిల చిరువెళ్ల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారి కిషోర్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆత్మకూరులోని సిండికేట్ ఫార్మర్స్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ, వెన్నవాడ, బట్టేపాడు పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు సాగు చేసిన వరి రకాలైన కెఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, ఎన్ఎల్ఆర్ 34449 గ్రేడ్ రకాలు పుట్టికి (850 కేజీలు)రూ. 19720 చొప్పున అమ్ముకొనే వీలుంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు, తేమశాతం నిర్ధారణ, శాంపిల్ సేకరణ, మిల్లులకు ధాన్యం సరఫరా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు యస్థాని, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

అనంతసాగరం : మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా 11 రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు అనంతసాగరం ఏవో శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతు పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. పుట్టికి రూ 19,720 చెల్లించడం జరుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

కావలి పీజీ కళాశాల అధ్యాపకుడిపై విచారణకు త్రిసభ్య కమిటీ

కావలిటౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి) పలు ఆరోపణలు ఎదుర్కొన్న కావలి పీజీ కళాశాల అధ్యాపకుడిపై విచారణకు బుధవారం వీఎస్‌యూ త్రిసభ్య కమిటీని నియమించినట్లు తెలిసింది. పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు మహిళా హాస్టల్‌లో అభివృద్ధి పనులు పరిశీలించాలని, మహిళా బాధ్యురాలి సమక్షంలో కాకుండా ఒంటరిగా హాస్టల్‌లో ప్రవేశించినట్లు అనధికార ఫిర్యాదులున్నాయి. బహిరంగంగా ఫిర్యాదు చేస్తే మార్కుల విషయంలో ఇబ్బంది పెడతారన్న భయంతో విద్యార్థినులు భయపడుతూ అనధికార ఫిర్యాదులు అందించినట్లు తెలుస్తోంది. ఇటీవల సహచర మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ పట్ల కూడా ఆ అధ్యాపకుడు అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వస్తున్న ఆరోపణలపై వీసీ మందలించినట్లు తెలుస్తున్నది. ఆ అధ్యాపకుడి వైఖరిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో వర్సిటీ అధికారులు బుధవారం విచారణకు త్రిసభ్య కమిటీని నియమించారు. నిరంతరం ఏదో ఒక వివాదంతో పీజీ కళాశాల రచ్చకెక్కుతుండడంతో అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

జలాశయంలో యువకుడి మృతదేహం



ప్రభాకర్ మృతదేహం

అనంతసాగరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం ఎగువన నీటిలో బుధవారం ఓ యువకుడి మృతదేహాన్ని జాలర్లు గుర్తించారు. ఈమేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని వెలికితీశారు. మండలంలోని పాతదేవరాయపల్లికి చెందిన బీ ప్రభాకర్ (30)గా గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. లేక ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎర్రచందనం' వాహనం పట్టివేత

● టోల్‌ప్లాజా వద్ద స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వెంకటాచలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తున్న ఒక వాహనాన్ని బుధవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న మహీంద్రా బొలెరో వాహనంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందింది. దీంతో తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ వాహనాన్ని వెంబడిస్తూ వచ్చారు. వెంకటాచలం సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద స్థానిక పోలీసుల సహకారంతో బొలెరో వాహనాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకెళ్లారు.

యథేచ్ఛగా చికెన్ వ్యర్థాల సరఫరా



స్థానికులు పట్టుకున్న చికెన్ వ్యర్థాల డ్రమ్ములున్న వాహనం

సంగం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపల చెరువులకు చికెన్ వ్యర్థాల సరఫరా యథేచ్ఛగా కొనసాగుతోంది. చికెన్ వ్యర్థాలతో చేపల పెరుగుదల ఉండడమే కాకుండా మేత ఖర్చు బాగా తగ్గుతుండడంతో నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను చేపల చెరువుల్లో వేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో సమీప పొలాల రైతులతోపాటు ప్రయాణికులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అంతేకాకుండా చికెన్ వ్యర్థాలతో పెంచిన చేపలు తింటే క్యాన్సర్ తదితర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చికెన్ వ్యర్థాలను తరలించే వాహనాలను అరికట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

మోసం, వరకట్నం వేధింపులపై కేసు

నెల్లూరు(క్రైం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అంటూ నమ్మించి మోసగించి పెళ్లి చేసుకోవడమేకాక అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తింటి వారిపై చిన్నబజారు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని మెక్లీన్స్ రోడ్డుకు చెందిన యువతికి పెళ్లిచేసేందుకు తల్లిదండ్రులు మ్యాట్రిమోనీలో సంబంధాలు చూశారు. విజయవాడకు చెందిన ఆలీఖాన్ అందులో పరిచయం అయ్యాడు. తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని, నెలకు రూ.80 వేలు జీతం వస్తుందని నమ్మించాడు. దీంతో యువతి తల్లిదండ్రులు రూ.15 లక్షల నగదు, 13 సవర్ల బంగారం కట్నకానుల కింద ఇచ్చి పెళ్లి చేశారు. రెండు నెలలు వారి కాపురం సాఫీగా సాగింది. ఆ తర్వాత నుంచి ఆలీఖాన్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. దీనికితోడు అతను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాదని, అమ్మాయిల బ్రోకర్ అని తెలిసి భార్య నిలదీయగా ఆమెపై దాడిచేశాడు. అత్తమామలు, ఆడబిడ్డ సైతం దుర్భాషలాడారు. అదనపు కట్నం కోసం చిత్రహింసలు పెట్టి ఇంటి నుంచి గెంటేశారు. దీంతో ఆమె పుట్టింటికి చేరుకొని జరిగినదంతా కుటుంబ సభ్యులకు తెలిపింది. భర్త, అత్తింటి వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి దుర్మరణం

నెల్లూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జొన్నవాడ - నరసింహకొండ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) డిపోకు చెందిన కార్మికుడు దుర్మరణం చెందాడు. అంది న సమాచారం మేరకు... ఆత్మకూరుకు చెందిన నల్లమేకల మస్తాన్ (35) నరసింహకొండ వద్దనున్న ఐఎంఎల్ డిపోలో హమాలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో దేవరపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్కూటర్ ఆపుకుని మూత్రవిసర్జన చేస్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో స్కూటర్ మస్తాన్‌ను అతివేగం గా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు నెల్లూరుకు తరలి స్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. మస్తాన్‌కు భార్య, ఇద్దరు బిడ్డలున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన ఐఎంఎల్ డిపోలో విషాదాన్ని నింపింది.

వ్యర్థాల రవాణాపై 14 కేసుల నమోదు : సీఐ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరు, చెన్నై రాష్ట్రాల నుంచి చికెన్ వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకుని ఇప్పటి వరకు 14 కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొంత మంది మీడియా, యూట్యూబ్ ఛానల్స్ పేరు చెప్పి చికెన్ వ్యర్థాల వాహనదారులను పోలీసులకు చెబుతామని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి వారిపై నిఘా పెట్టామన్నారు. కొందరి ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. ఇకపై వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమించితే అధిక జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులురెడ్డి ఆటో డ్రైవర్లును హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ లోడ్, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించామని హెచ్చరించారు. బాలికలు, ఈవ్‌టీజ్ చేసేవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

న్యూస్ బాక్స్

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

సీతారామపురం, మార్చి 5: మండల పరిధిలోని ఓగురువాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో మస్తాన్‌వలి బుధవారం తనిఖీ చేశారు. బోధనా తీరు, సౌకర్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎఫ్ఏ 4 పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పట్టుదలతో పదవ తరగతిలో విజయం సాధించి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓగురువాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిగే కొండయ్య, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అడవులు అగ్నికి ఆహుతి కాకుండా చూడాలి

ఉదయగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గంకొండ అగ్నికి అహుతవుతోంది. దుర్గం కొండపై గల సల్ఫాపేట్ జలపాతం పారే చోట బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసిపడ్డాయి. మంటలకు పచ్చని చెట్లు దగ్ధమవడంతోపాటు మూగజీవాలు ఇబ్బందులు పడ్డాయి. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి అడవులు అగ్నికి అహుతి కాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'పెండ్యాల'కు ఘన నివాళి

ఉదయగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు, రాజీవ్‌రత్న అవార్డుగ్రహీత పెండ్యాల రామ్మోహన్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విలీనం చేయవద్దని వినతి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉదయగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూ బాలికల ప్రాథమిక పాఠశాలను నార్త్ పాఠశాలలో విలీనం చేయవద్దని బుధవారం పీఎంసీ, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో-2 శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో అవసరమైన తరగతి గదులతోపాటు విశాలమైన క్రీడాస్థలం ఉందన్నారు. ఉర్దూ పాఠశాల కావడంతో మరో పాఠశాలలో విలీనం చేస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. గతంలో రెండు దఫాలుగా విలీనం చేయవద్దని వినతిపత్రాలు సైతం అందజేశామన్నారు. తమ పాఠశాలను విలీనం చేయకుండా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి యథావిధిగా కొనసాగించాలని కోరారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన ఎంఈవో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సర్వేలను వేగవంతం చేయాలి : జడ్పీ డిప్యూటీ సీఈవో



డిప్యూటీ సీఈవోను సన్మానిస్తున్న సిబ్బంది

వింజమూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సచివాలయాల్లో జరుగుతున్న సర్వేలను వేగవంతంగా, పారదర్శంగా చేపట్టాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో జిల్లా, గ్రామ, వార్డు సచివాలయ ఇన్‌చార్జ్ ఆఫీసర్ మోహన్ రావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ప్రజలకు సేవలను సకాలంలో అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం మండల కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల రికార్డులు సిద్ధం చేయండి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 18వ సామాజిక బృందం తనిఖీల్లో భాగంగా మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం పనుల రికార్డులను సిద్ధం చేయాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. సామాజిక తనిఖీ బృందం అడిగిన రికార్డులన్నీ త్వరితగతిన అప్పగించడంతో పనుల తనిఖీల్లో వారికి సహకరించాలని కోరారు. కాగా, మండలంలో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో విధులు నిర్వహించిన కొందరు క్షేత్రసహాయకులు అధికారులకు రికార్డులు ఇవ్వకపోవడంతో పాటు తాము తనిఖీ బృందానికి సహకరించేది లేదని తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వం మారగానే తమను అకారణంగా విధుల నుంచి తొలగించారని, తామెందుకు సహకరించాలని అధికారులను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. సామాజిక తనిఖీ బృందం వచ్చి రోజులు గడుస్తున్నా వారికి పూర్తిస్థాయి రికార్డులు అప్పగించకపోవడం, కొందరు క్షేత్రసహాయకులు రికార్డులు ఇవ్వకపోవడంతో అధికారులు ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

రక్షణగోడ లేని వంతెనతో పొంచి ఉన్న ప్రమాదాలు



రక్షణ గోడ లేక ప్రమాదకరంగా ఉన్న వంతెన

ఉదయగిరి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల సరిహద్దు గ్రామమైన జీ.కొత్తపల్లి గ్రామ సమీపంలోని వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రధాన రహదారిపై నిర్మించిన ఆ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోవడంతో అటుగా ప్రయాణాలు సాగించే వాహన దారులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఆమార్గంలో ఆర్టీసీ, పాఠశాలల బస్సు లు, ఆటోలు, మోటారుబైకులు, ఇతరత్రా లెక్కకు మించిన వాహనాలు పోటీలు పడి పరుగులు తీస్తుంటాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపటాలని కోరుతున్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి

●రాష్ట్ర మంత్రి నిమ్మలకు సీపీఎం నేతల వినతి



మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మర్రిపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా వెంటాడుతున్న నీటి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. బుధవారం విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి సోమశిల హైలెవెల్ కెనాల్ పనులు తిరిగి ప్రారంభించాలని, అందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని విన్నవించారు. ఫ్లోరైడ్ పీడిత గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మెట్టప్రాంతానికి తాగు, సాగు నీరు అందించాలని మంత్రిని కోరినట్లు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మూలి వెంగయ్య తెలిపారు.

ఆ కార్యాలయానికి వారిద్దరే దిక్కు!

● ఇదీ ఉదయగిరి ఆర్‌అండ్‌బీ కార్యాలయం తీరు



తలుపులు తెరుచుకోని జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల గది

ఉదయగిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆ కార్యాలయంలో కొందరు నెలకు రూ.లక్షల్లో, మరికొందరు రూ.వేలల్లో వేతనాలు పొందుతున్నారు. అయితే యథేచ్ఛగా విధులకు గైర్హాజరవుతూ కార్యాలయం వైపు కన్నెత్తి చూడడంలేదు. కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు మాత్రమే విధుల్లో ఉంటారు. మిగిలిన సిబ్బంది ఎక్కడా అని అడిగితే వారు నీళ్లు నములుతారు. ఉదయగిరి ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఒక డీఈ, ఇద్దరు ఏఈలు, ఒక సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు, 12 మంది గ్యాంగ్ మజ్దూర్ కూలీలు ఉన్నారు. అయితే అధికారులు, ఉద్యోగులు ఇక్కడ వేతనాలు పొందుతూ కావలిలో విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయం పరిధిలో సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు, వింజమూరు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో ఏదైనా సమస్య తలెత్తితే అధికారికి చెప్పుకునేందుకు కార్యాలయానికి వస్తే రికార్డు అసిస్టెంట్లే దిక్కవుతారు. ఇటీవల ఆయా మండలాల్లో రూ.లక్షల్లో రోడ్ల మరమ్మతు పనులు చేపట్టినా అంతా గ్యాంగ్ మజ్దూర్ కూలీల పర్యవేక్షణలోనే జరిగినట్లు సమాచారం. ఈవిషయమై ఆర్ అండ్ డీఈ మదన్‌కుమార్‌ను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఫోన్ పని చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టి ఉద్యోగులు విధులకు హాజరయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమవుతున్న వాటర్ ప్లాంట్

● తుప్పు పడుతున్న విలువైన సామగ్రి ● నిరుపయోగంగా ట్రాక్టర్లు, ట్యాంకర్లు



మూతపడ్డ వాటర్ ప్లాంట్

ఏఎస్ పేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో సంవత్సరం తిరగక ముందే మూతపడింది. గ్రామీణ ప్రజలకు మంచి నీరు అందించాలన్న ఉద్దేశంతో నిర్మించిన వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. మండల కేంద్రమైన ఏఎస్ పేటతో పాటు సమీపంలోని చందులూరుపాడు, మదారాబాదు, జమ్మవరం, కాకర్లపాడు, చౌటభీమవరం, పెద్దహబీపురం, అనుమసముద్రం, గండువారిపల్లి, పందిపాడు, పోనుగోడు, తెల్లపాడు తదితర 12 గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశ్యంతో గండువారిపల్లి గ్రామంలో సుజల స్రవంతి పథకంతో మెయిన్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. వాటర్ ప్లాంట్ నుంచి గ్రామాలకు నీటిని తరలించడానికి ప్రత్యేకంగా సుమారు 5 ట్యాంకర్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. దీంతో 12 గ్రామల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పోయింది. కాగా, ప్లాంట్ ప్రారంభించిన మొదటిలో బాగానే ఉన్నా తరువాత అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో మూతపడింది. విద్యుత్ బిల్లులు నెలల తరబడి చెల్లించక పోవడంతో వాటర్‌ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో నీటిశుద్ధి, కూ లింగ్ ఆగిపోయింది. అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోకపోవడంతో మూతపడింది.

తుప్పు పడుతున్న లక్షల విలువైన సామగ్రి

వాటర్ ప్లాంట్ మూతపడి సంవత్సరం పైగా కావడంతో నీటిని శుద్ధిచేసే విలువైన యంత్రాలు తుప్పు పడుతున్నాయి. ట్యాంకర్లు, ట్రాక్టర్లు ప్లాంట్ ముందే నెలల తరబడి అలాగే ఉండడంతో టైర్లు పంచరై, ఇంజన్లు తుప్పు పడుతున్నాయి. నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలలో ఏర్పాటుచేసిన స్టీల్ వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. వాటి చుట్టూ కంప చెట్లు మొలిచాయి.

తాగునీటి కోసం అవస్థలు

గ్రామీణ ప్రజలకు తాగునీరు అందకపోవడంతో వారికి అవస్థలు తప్పడం లేదు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్ ‿ల నుంచి కొనుగోలు చేసుకుని తాగాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుద్ధి వాటర్ ప్లాంట్ ఉండి సరఫరాకు వాహనాలు ఉండి కూడా కేవలం నిర్వహణ లోపం, అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా వాటర్ ప్లాంట్ మూతపడిందని, దానిని పునరుద్ధరించి తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తుప్పు పడుతున్న యంత్రాలు



నిరుపయోగంగా వాటర్ ట్యాంకర్లు, ట్రాక్టర్

ఉలవపాడులో ప్రధాన రోడ్డు కబ్జా !

● అంగళ్లు, తోపుడు బండ్లతో రద్దీగా ట్రంకురోడ్డు ● ఖాళీ స్థలానికి రూ.వేలు అద్దె వసూలు చేస్తున్న వైనం
● కిలోమీటరు మేర ట్రాఫిక్ అంతరాయం ● చోద్యం చూస్తున్న పంచాయతీ, పోలీసు అధికారులు

ఉలవపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారి ఇరువైపులా అంగళ్లు, పండ్లు, కూరగాయలు, కొబ్బరి బోండాల షాపులు, తోపుడు బండ్లతో కబ్జాకు గురైంది. విశాలమైన 60 అడుగుల రోడ్డు కలిగిన ట్రంకురోడ్డు ఇరువైపులా అంగళ్ల నిర్వాహకులు ఒకరిని చూచి ఒకరు ముందుకు జరుగుతూ రోడ్డు మార్జిన్ లేకుండా చేశారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు రోడ్డుపైనే ఆపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం నాలుగు మొదలైన ట్రాఫిక్ రాత్రి 10గంటల వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అంబేడ్కర్ బొమ్మ సెంటర్ మలుపు వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. పీవీ రావు విగ్రహం నుంచి దర్గా చెట్టు వరకు కిలోమీటరు మేరకు ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు మార్జిన్ కబ్జాకు గురైంది. ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు ఎదురెదురుగా వచ్చినప్పుడు మార్జిన్ దిగడానికి ఆటోలు, బైక్‌లు నిలిపి ఉండటంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది.



ఉలవపాడులోని అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో వాహనాల రద్దీ

● ప్రభుత్వ స్థలంలో అద్దె దందా

ఉలవపాడులో అద్దె ఇళ్ల కంటే ట్రంక్‌రోడ్డు ఇరువైపులా ఖాళీ స్థలానికి అద్దె రేటు ఎక్కువ. రోడ్డుకు ఇరువైపులా భవనాల యజమానులు వ్యాపారాల నిమిత్తం అద్దెకు రూములు ఇస్తుంటారు. ప్రధాన రహదిరికి ఇరువైపులా పంచాయతీ మురుగు కాలువ నిర్మాణం హద్దును చూపిస్తుంది. డ్రైనేజీ దాటిన తరువాత ఉన్న ఖాళీ స్థలం ఆర్‌అండ్‌బీకి చెందింది. అయితే ట్రంకు రోడ్డు మార్జిన్ వరకు ఖాళీ స్థలం తమదే అన్నట్లు ప్రధాన రహదిరిపై ఇళ్ల యజమానులు టిఫిన్, కొబ్బరిబొండాలు, పండ్ల దుకాణాలు, స్వీట్ షాపులు, కూరగాయ అంగళ్లు, పానీపూరి, న్యూడిల్స్ వంటి తోపుడుబండ్లు వ్యాపారుల నుంచి నెలకు గరిష్ఠంగా రూ.6వేలు అద్దెకు వసూలు చేస్తున్నారు. ఈ రకంగా ఏళ్ల తరబడి ఆర్‌అండ్‌బీ ఖాళీ స్థలానికా లక్షల్లో అల్పాదాయం పొందుతున్నారు. ఇంత జరుగుతున్నా తమకేమి పట్టనట్టుగా పంచాయతీ అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

లింగసముద్రం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపవని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని స్క్వాడ్ అధికారి తనిఖీ చేశారు.బుధవారం ఉదయం 9.15 గంటలకు నెల్లూరు డీఎస్‌సీ కమిటీ సభ్యులు వేణు, సీనియర్ ఇంటర్ ఇంగ్లిషు పరీక్ష రాస్తున్న విద్యార్థులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ కే స్నేహలత తదితరులు ఉన్నారు.

ఎస్టీ కాలనీలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

వలేటివారిపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ఎస్టీకాలనీలో బుధవారం పంచాయతీ కార్యదర్శి మురళీ పారిశుధ్య పనులు చేయించారు. ఆ ప్రాంతంలో డ్రైనేజీకి అడ్డుగా చెత్తచెదారంతో మురుగునీరు ముందుకు పోకుండా నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి వచ్చింది.ఆయన వెంటనే స్పందించి పంచాయతీ కార్యదర్శికి చెప్పి పనులు చేయించారు.

8న జూడో ఎంపికలు

ఉలవపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూడో అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న బాలబాలికలకు, మహిళలు, పురుషుల జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జూడో అడహక్ సెక్రటరీ మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. కరేడు జడ్పీ హైస్కూల్ మైదానం వెనుక ఉన్న జీఎం హాల్‌లో శనివారం ఎంపికలు జరుగుతాయన్నారు. జూనియర్ విభాగంలో పాల్గొనే విద్యార్థులు 2002 నుంచి 2010 మధ్య పుట్టినవారై ఉండాలన్నారు. మహిళలకు, పురుషులు వయసుతో నిమిత్తం లేకుండా పోటీల్లో పాల్గొవచ్చునన్నారు. వివరాలకు 89190 36160 నంబరుకు సంప్రదించాలన్నారు.

అల్లూరులో వరి కోతలు



వరి కోస్తున్న యంత్రం

అల్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రబీ సీజను వరికోతలు ప్రారంభమయ్యాయి. మండలంలో అధికారికంగా, అనధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుంటారు. ఈ సీజనులో ఆశాజనకంగా ధాన్యం దిగుబడులు ఉన్నాయి. మండలంలో దాదాపుగా 60 శాతం మంది రైతులు బీపీటీ 5204 రకం సాగు చేపట్టారు. కెఎన్ఎం 1638 రకం దాదాపు 30 శాతం మంది రైతులు సాగు చేశారు. దిగుబడులు కొంత నిరాశను మిగిల్చినప్పటికీ ధరలు తీవ్ర నిరాశకు గురిచేశాయి.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



బోధనను పరిశీలిస్తున్న ఎంఈవో-2 ఆనందరావు

కొండాపురం, మార్చి5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో-2 ఆనందరావు అన్నారు. మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా జరుగుతున్న బోధనను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేయాలన్నారు. అనంతరం తూర్పుపాలెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం. మారుతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందుకున్న విద్యార్థులతో వైద్యాధికారి వెంకటసుబ్బయ్య

కలిగిరి, మార్చి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరకొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సుమారు 100 మంది విద్యార్థులకు జలదంకి మండలం గట్టుపల్లి పీహెచ్‌సీ నేత్రవైద్యాధికారి కే. వెంకటసుబ్బయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని ఐదుగురు విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి కళ్లద్దాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎమ్.ఉమామహేశ్వర శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి : జేసీ కార్తీక్

కావలి రూరల్, మార్చి5(ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని జేసీ కే. కార్తీక్ పేర్కొన్నారు. కావలి మండలం గౌరవరంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ బయట మార్కెట్ కంటే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పుట్టి రూ.19,720తో కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యంలో తేమశాతం 23 నుంచి 24 శాతం ఉండటం వల్ల, ధాన్యం ఆరబోతకు కల్లాలు లేనందున ధాన్యాన్ని బయట మార్కెట్‌లో అమ్ముతున్నామని రైతులు జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన తేమ శాతం విషయంలో రైతులకు కొంత వెసులుబాటు కల్పిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరును పరిశీలించి, ధాన్యం అమ్మకాలపై అవగాహన కల్పిస్తుండాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. అనంతరం మద్దూరుపాడులోని సివిల్ సప్లయ్ గోదాములను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. పట్టణంలోని 8వ నెంబరు రేషన్ దుకాణంలో నిత్యావసర వస్తువుల స్టాకును పరిశీలించి, ఎండీయూ వాహనంలోని సరుకులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీక్రిష్ణ, ఏడీఏ నాగరాజు, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏవో లలిత, పలు గ్రామాల రైతులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● రైతులకు అవగాహన కల్పించాలి

బిట్రగుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించాలని జేసీ కార్తీక్ అన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అన్నీ కచ్చితంగానూ, సిద్ధంగానూ ఉండాలని సిబ్బందికి సూచించారు. బయట మార్కెట్‌లో దళారులు పుట్టి రూ.18,200 కు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, నష్టమైనా శ్రమపడకుండా రైతులు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని స్థానిక రైతు గోవర్ధన్‌రెడ్డి జేసీ దృష్టికి తీసుకుపోయారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు కలిగే లాభాలను సంబంధిత అధికారులు వివరించాలన్నారు. కార్యక్రమంలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ, డీటీ భరత్ కుమార్, ఏడీఈ నాగరాజు, ఏవో విజయలక్ష్మి, బోగోలు టీడీపీ ఇన్‌చార్జి సీహెచ్ వెంకటేశ్వర్లు వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



కావలి మండలం గౌరవరం ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

● బోగోలులో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

బోగోలు మండలంలోని వివిధ పంచాయతీల్లో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ బోగోలు - 3, 1, నాగులవరం, జక్కేపల్లి గూడూరు, తాళ్లూరు, కడనూతల, కోవూరుపల్లి, బిట్రగుంట, ముంగమూరు, జువ్వలదిన్నె, ఏనుగులబావి పంచాయతీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సాధారణ రకం ధాన్యం పుట్టి రూ.19,550, ఏ గ్రేడ్ రూ.19,720కు కొనుగోలు చేస్తామన్నారు.

ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి

వలేటివారిపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) గర్భిణీలు, బాలింతలు ప్రొటీన్లు ఎక్కువగా ఉండే పోషక పదార్థాలను తీసుకోవాలని కందుకూరు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవో శర్మిష్ఠ తెలిపారు. మండలంలోని చుండి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడుతూ కేలరీలు ఎక్కువగా ఉండే విత్తనాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. తదుపరి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణీలకు సీమంతాలు చేసి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, కార్యకర్తలు జ్యోతి, రాజ్యలక్ష్మి, సుశీల తదితరులు పాల్గొన్నారు.



లింగసముద్రం : బాల్య వివాహలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శైలజ, తదితరులు



వలేటివారిపాలెం : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో శర్మిష్ఠ

● బాల్య వివాహలపై అవగాహన

లింగసముద్రం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలకు బాల్య వివాహలపై మండలంలోని పెదపవని సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు.బుధవారం పెదపవని అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డేను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహల గురించి, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ పురుషోత్తమ్, అంగన్‌వాడీ నాయకురాళ్లు శైలజ, శాంతి, రాజేశ్వరి, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపు కావలిలో జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

కావలి,మార్చి5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 3 గంటలకు స్థానిక మినీస్టేడియంలో కబడ్డీ సబ్‌జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీ వెంకటేశ్వర్లు, వీ. శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2009 మార్చి3 తర్వాత జన్మించి, 55 కిలోల లోపు బరువు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన జట్లు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఈనెల 14,15,16 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 94405 03548, 92989 50860 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సునీల్‌కుమార్ సస్పెన్షన్ ఎత్తివేయాలని నిరసన

కందుకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మాల ఉద్యోగుల సంఘం, మాలమహానాడు లిబరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కందుకూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిర్వహించిన నిరసనలో ఎల్. బ్రహ్మయ్య, పాలేటి కోటేశ్వరరావు, బొక్క వెంకటేశ్వర్లు, డీసీహెచ్ మాలకొండయ్య, బుద్ధకోటి తదితరులు మాట్లాడుతూ సునీల్‌కుమార్‌ను విధుల్లోకి తీసుకుని, డీజీపీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆలయానికి శంకుస్థాపన

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పుసాలిపాలెంలో పల్నాటి వీర్ల అంకమ్మ ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. అనుమల వెంకటశరత్‌బాబు, కార్తీక్‌శాంతి దంపతులు భూమిపూజ నిర్వహించగా, ఆలయ శిల్పులు మాట్లాడుతూ పూర్తిరాతికట్టడంతో ప్రాచీన ఆలయాలకు దీటుగా పల్నాటి వీర్ల అంకమ్మ ఆలయాన్ని నిర్మిస్తామన్నారు.

'ప్రకాశం'లో డ్రోన్లు, స్మార్ట్ హెల్మెట్ల రూపకల్పన



స్మార్ట్ హెల్మెట్, డ్రోన్లను రూపొందించిన విద్యార్థులు, డీన్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ కంచర్ల రామయ్య

కందుకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శాస్త్రసాంకేతికతను వినియోగించుకుని ప్రజలకు ఉపకరించే పరికరాలను తయారుచేసేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులను, వారిని ప్రోత్సహిస్తున్న డీన్ డాక్టరు ఎం. లక్ష్మణరావును కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అభినందించారు. కళాశాల విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ హెల్మెట్, డ్రోన్ ప్రాజెక్టులు పలు పోటీల్లో బహుమతులు గెలుచుకున్న సందర్భంగా బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగుమందులు పిచికారి చేసుకునేలా, అతితక్కువ బడ్జెట్‌తో డ్రోన్‌ను రూపొందించిన వైనాన్ని వారు ఆయనకు వివరించారు. అలాగే స్మార్ట్ హెల్మెట్‌కు కూడా ప్రజల నుంచి మంచి ఆదరణ ఉన్నట్లు తెలిపారు.

జీ.మేకపాడులో 'పొలం పిలుస్తుంది'



కందిపైరును పరిశీలించి నూర్పిళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలిస్తున్న ఏవో రాము తదితరులు

కందుకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ. మేకపాడులో బుధవారం మండల వ్యవసాయాధికారి వీ. రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించుకోవటం ద్వారా గిట్టుబాటు ధర పొందాలని కోరారు. జీ. మేకపాడులో అధిక విస్తీర్ణంలో సాగుచేసి ఉన్న కందిపైరును పరిశీలించి నూర్పిళ్లలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై సూచనలిచ్చారు. రైతులంతా తక్షణం తాము ఈ క్రాప్ చేయించుకోవాలని కోరారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

● మరొకరికి గాయాలు

వలేటివారిపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె జాతీయ రహదారిపై బుధవారం ఉదయం కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు, అయ్యవారిపల్లెకు చెందిన గుడిమిట్ల పెద మాలకొండయ్య (75) ఇంటి దగ్గర నుంచి బస్టాండు సెంటరుకు టీ తాగేందుకు వస్తున్నాడు . అదే సమయంలో వలేటివారిపాలెం నుంచి మొగిలిచెర్ల వెళ్తున్న కారు వేగంగా వచ్చి మాలకొండయ్యను ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా లింగసముద్రం మండలం మొగిలిచెర్లకి చెందిన పవని నాగేంద్రప్రసాద్ కారును హైవేలో వేగంగా డ్రైవింగ్ చేస్తూ అయ్యవారిపల్లె బస్టాండు సెంటరులో ముందుగా కుమ్మరి వెంకటేశ్వర్లును ఢీకొన్నాడు. వెంకటేశ్వర్లు గాయాలతో పడిపోయాడు. అప్పటికీ కారు కంట్రోల్ కాక నిలబెట్టి ఉన్న మోటారుబైకును ఢీ కొట్టడంతో అది నుజ్జునుజ్జు యింది. అనంతరం పెద్దమాలకొండయ్యను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మరిదినాయుడు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పెదమాలకొండయ్య మృతదేహం

9 నుంచి వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కావలిటౌన్, మార్చి5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కచ్చేరిమిట్టలో వెలసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు అన్నవరం వెంకటసత్యనారాయణ, తిరివీధి బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో వారు విలేకరులతో మాట్లాడారు. 9న అంకురార్పణ, 10న ధ్వజారోహణ, శేషవాహనసేవ, 11న హంసవాహనసేవ, 12న సింహవాహనసేవ, 13న హనుమంతసేవ, 14న గరుడ సేవ, 15న శ్రీవారి కల్యాణం, గజవాహన సేవ, 16న అశ్వవాహనసేవ, 17న ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు వారు వివరించారు. అనంతరం వారు బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు, కమిటీ బాధ్యులు తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్, ఎన్ హరిబాబు, కే. బాబు, వాసు పాల్గొన్నారు.

అంతిమ సంస్కారం మంచి పద్ధతి

బిట్రగుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మృతి చెందిన పశుపక్ష్యాదులను వదిలేయకుండా అంతిమ సంస్కారం చేయడం మంచి పద్ధతని, సామాజికంగా ఆరోగ్యకరమని కావలి డివిజన్ అధికారిణి మాధవీలత అన్నారు. బోగోలులోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక శిక్షణకు బుధవారం ఆమె పరిశీలించారు. తడి, పొడిచెత్తను వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారు చేసే పద్ధతి, రీసైకిలింగ్‌లను వివరించారు. పశుపక్ష్యాదుల దహనవాటిక నిర్వహణతో పాటు గ్రీనరీ పెంచే విధానంపై శిక్షణ ఇచ్చారు. బోగోలు కార్యదర్శి అబ్దుల్ జహీర్ జరిగిన ఈ కార్యక్రమంలో అల్లూరు ఎంపీడీవో రజనీకాంత్, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, కార్యదర్శులు, గ్రీన్‌అబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్ పాల్గొన్నారు.



పశుపక్ష్యాదులకు అంతిమ సంస్కారాన్ని నిర్వహిస్తున్న డివిజన్ అధికారిణి మాధవీలత తదితరులు

సర్వే పనులు వేగవంతం చేయాలి

కలిగిరి, మార్చి5(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న సర్వేను వేగవంతం చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో జే.మోహనరావు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి, ఇప్పటివరకు చేసిన సర్వే రిపోర్టును పరిశీలించారు. సర్వే పనులను వేగవంతంచేసి నిర్ణీత కాలంలో సమాచారాన్ని కంప్యూటరీకరణ చేయాలని ఎంపీడీవో ప్రత్యూషను కోరారు. ఈసందర్భంగా కలిగిరి-1, 2 సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయపరిపాలనాధికారి జ్యోతిర్లక్ష్మి, దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.



సర్వే ప్రగతిని తనిఖీ చేస్తున్న మోహనరావు

కావలిలో మెగా రక్తదాన శిబిరం

కావలిటౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళరావునగర్‌లో బుధవారం పీటర్‌పాల్ మినిస్ట్రీస్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చర్చి ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల రక్తనిధి సహకారంతో పీటర్‌పాల్ మినిస్ట్రీస్ కన్వీనర్ డీ సుధీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో యువత, పాస్టర్లు, ట్రాన్స్‌జెండర్లు రక్తదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, ఆర్‌ఎంవో డాక్టర్ ప్రమీల, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ శ్రీధర్ పాల్గొని నిరంతర ఉచిత ఆసుపత్రిని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ వైద్యశాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ విజయరాణి, ప్రముఖ గాయకులు పాడేటి థామస్, డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏసుబాబు, జయపాల్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువత, ట్రాన్స్‌జెండర్లు

రెగ్యులర్ వీఏఏలు లేక ఇక్కట్లు

● అగచాట్లు పడుతున్న అన్నదాతలు

లింగసముద్రం, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొన్ని గ్రామ సచివాలయాలకు రెగ్యులర్ గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏలు) లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. లింగసముద్రం -2 సచివాలయం, ఎర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, అన్నెబోయినపల్లి, చినపవని, పెదపవని -2, సచివాలయాలకు రెగ్యులర్ వీఏఏలు లేరు.ముఖ్యంగా లింగసముద్రం-2 సచివాలయంలో సుమారు ఏడాది నుంచి వీఏఏ లేకపోవడంతో ఈ కార్యాలయం తలుపులు తెరుచుకోలేదు.



లింగసముద్రంలో ఏడాది నుంచి మూతపడిన రైతు సేవా కేంద్రం

● బదలీపై వెళ్లిన స్థానంలో కొత్త వారేరీ ?

ఇకపోతే కొందరు వీఏఏలు కూడా చాలా కాలం క్రితం బదిలీపై వెళ్లారు.దీంతో ఆ రైతు సేవా కేంద్రాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.ప్రస్తుతం ఉన్న ఐదుగురు వీఏఏలు, ఇద్దరు హార్టీకల్చర్ సహాయకులు రైతులకు సేవలు అందిస్తున్నారు.గత 10 రోజుల నుంచి రైతులు రైతు విశిష్ట సంఖ్య నమోదు కోసం రైతు సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు.అయితే రెగ్యులర్ వీఏఏలు లేని సచివాలయాల పరిధిలోని రైతులు ఇన్‌చార్జులుగా ఉన్న వీఏఏల వద్దకు వెళుతున్నారు.దీంతో రైతు సేవా కేంద్రాల్లో రైతుల రద్దీ ఎక్కువగా ఉంటోంది.ఈ కారణంగా విశిష్ట సంఖ్య నమోదులో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోందని వాపోతున్నారు.అయితే కొందరు వీఏఏలు తాము ఇన్‌చార్జ్‌లుగా ఉన్న సచివాలయాలకు వెళ్లి రైతులకు విశిష్ట సంఖ్య నమోదు చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఆయా సచివాలయాల్లో వీఏఏలను నియమించాలని రైతులు కోరుతున్నారు.

దోమలు లేని నగరంగా మారుస్తాం

● మంత్రి నారాయణ

నెల్లూరు (హరనాధపురం) మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నగరాన్ని దోమలు లేని నగరంగా చేయడానికి రామిరెడ్డికాలువ, ఉయ్యాలకాలువకు శ్లాబు వేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారా యణ తెలిపారు. బుధవారం నెల్లూరులోని కలెక్టర్ తిక్కన భవన్‌లో కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్‌లతో కలిసి అధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ ఇందుకోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారు. నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగు నీటికి రూ.165కోట్లు నిధులు త్వరలో మంజూరు కాను న్నట్లుపేర్కొన్నారు. నగరంలోని అన్నీ పాఠశాలల్లో అత్యాధు నిక ఆటవస్తువులు ఏర్పాటు చేస్తున్నా మని, వీఆర్ హైస్కూ ల్‌ను మోడల్ స్కూల్‌గా తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు. ఈనెల 15నుంచి స్కూల్ ఆధునీకరణ పనులు ప్రారంభి స్తున్నట్లు చెప్పారు. నగరంలో ఒక్క స్కూల్‌ను కూడా మూసే ప్రసక్తే లేదని, ఏదైనా గత ప్రభుత్వం మూసివేసి వుంటే వాటిని తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో స్వీపింగ్ యంత్రాలను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. స్వీపింగ్ మిషన్లు, కాంపాక్టర్లు అందించి అన్నీ నగరాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో నెల్లూరు ఆర్డీవో వంశీకృష్ణ, అదనపు కమిషనర్ వై.ఓబు లేసు నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు దేశ్‌నాయక్, గంగాధర్, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు వెంకటలక్ష్మీ, శోభారాణి, మెప్మా పీడీ రాధ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

నుడా ఆర్థిక లోటును

భర్తీ చేస్తాం

ప్రతి నియోజకవర్గంలో ఎంఐజీ లేఅవుట్లు

చైర్మన్ కోటంరెడ్డి వెల్లడి

నెల్లూరు (జడ్పీ) : ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా)ను ఎంఐజీ లే అవుట్ల ద్వారా గట్టెక్కిస్తామని ఆ సంస్థ చైర్మన్ కోటం రెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవా రం నగరంలోని నుడా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉ న్నా ప్రతి నియోజవర్గంలో ఎంఐజీ లే అవుట్లు ఏర్పాటు చేయడం ద్వారా వంద ల కోట్ల నిధులు సమకూర్చుకోనున్నట్లు చెప్పారు. ఈ లే అవుట్లలోని ప్లాట్లను తక్కువ ధరకే ప్రజలకు అందించను న్నట్లు చెప్పారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో ఎంఐజీ లేఅవుట్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో మాట్లాడినట్లు చెప్పారు. అయితే, ఫ్యాక్టరీపై ఉన్న కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారని అన్నారు. అలాగే నగరంలోని ఆత్మకూరు బస్టాండ్‌ను ఆ ప్రాంతానికి తరలించేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు నుడా సహకారంతో జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ హిమబిందు, ఏవో రాజు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య) : జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్స్) లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో చేరడానికి విద్యార్థుల నుంచి ప్రవేశ పరీక్ష దర ఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న ఆయా ఆదర్శ పాఠశాలల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగు తుందని తెలిపా రు. ఆసక్తి గల వారు www.cse.ap.gov.in, www.apms.apcfms.in వెబ్‌సైట్‌లలో ఈనెల 31వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



పెరిగిన నిమ్మ ధర..

బస్తా రూ.8 వేలు

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : పొదల కూరు పట్టణంలోని నిమ్మ మార్కెట్ యార్డులో రెండు రోజులుగా నిమ్మ ధరలు అమాంతం పెరిగాయి. బస్తా (లూజు) కాయల ధర రూ.8వేలు పలికింది. కిలోల వంతున చూసుకుంటే రూ.70 నుంచి రూ.110 వరకు ధర ఉన్నట్లు వ్యాపారులు తెలిపారు. దీంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ ధరలు ఇంకా పెరుగుతాయని భావిస్తున్నారు. ఉష్ణో గ్రతలు పెరగడం వల్ల నిమ్మ వినియోగం ఇతర రాష్ట్రాల్లో పెరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీ మార్కెట్ ఒక్కసారిగా ఊపందుకు న్నట్లు వ్యాపారులు తెలిపారు. అయితే ప్రస్తుతం అందరి తోటల్లో కాయల్లేవు, ఉన్న రైతులకు మాత్రం మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది.

నెల్లూరులోని భువనేశ్వరీ సమేత మూలస్థానే శ్వరస్వామికి బుధవారం రాత్రి ఏకాంత సేవ నేత్రపర్వంగా జరిగింది. ఉదయం విశేష అభిషేకాలు, రుద్ర హోమ పూర్ణాహుతి, కుంభహారతులు, పూలంగిసేవ జరిగాయి. రాత్రి ఏకాంత సేవ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. వీ కృష్ణారావు, పద్మావతి ఉభయకర్తలుగా వ్యవహరిం చారు. ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. ఏకాంత సేవతో స్వామి వారి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

- నెల్లూరు (సాంస్కృతికం) ,(ఆంధ్రజ్యోతి)



ఆది దంపతులకు

ఏకాంతసేవ

మూలస్థానేశ్వర ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

నాసిరకంగా హైవే పనులు

కావలి నుంచి దుత్తలూరు వరకు జరుగుతున్న జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16 బీజీ)పనులు నిబంధనల మేరకు జరగడంలేదు. పనులు ప్రారంభించి రెండేళ్లు అయినా ఇంకా పూర్తికా లేదు. కలిగిరి శివారు ప్రాంతం నుంచి పట్టణం లోకి జరుగుతున్న విస్తరణ పనులు నాసిర కంగా జరుగుతున్నాయి. లేయర్లుగా వేయా ల్సిన మట్టిలో నాణ్యత పాటించడంలేదనే విమర్శలు న్నాయి.క్యూరింగ్ చేయని ప్రాం తంలో వాహనాలు వచ్చే సమయంలో దుమ్ములేవడంతో పాఠశాలలు, దుకాణాలలోకి దుమ్ము చేరుతోంది. నాసిరకం మట్టి వాడిన ప్రదేశంలో నీరుపట్టగానే ఆ ప్రాంతం బురదమయంగా మారుతోంది. నిబంధనల మేరకు గ్రావెల్, కంకర మిశ్రమాన్ని వాడడం లేదని వాహనదారులు పేర్కొంటు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)





పశువ్యాధుల నివారణే లక్ష్యం

పాడిరైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పాడి అభివృద్ధితోపాటు పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తూ అనేక పథకాలను ప్రవేశపెడుతోంది. అందులో భాగంగానే పశువులకు వచ్చే వ్యాధులను నివారణే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తోంది. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద జిల్లాలో గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పశుసం వర్థక శాఖ ఆధ్వర్యం లో ఈ నెలాఖరు వరకు కార్యక్రమం నిర్వహిస్తోంది.



పశువులకు టీకాలు వేస్తున్న పశుసంవర్థక శాఖ వైద్యులు, సిబ్బంది

● గాలికుంటు, బ్రూసెల్లోసిస్‌లకు ఉచితంగా టీకాలు

● నెలాఖరు వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం అమలు

నెల్లూరు (వ్యవ సాయం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపుగా 57,774 తెల్ల పశువులు, 6,46, 088 నల్ల పశువులు ఉన్నాయి. జిల్లాలో పాడిరంగంపై ఆధార పడి జీవిస్తున్న వారి కోసం కూటమి ప్రభుత్వం ఇప్పటికే గోకులాలు మంజూరుతోపాటు పశువులకు అవసరమైన పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుకూ చర్యలు తీసుకుం టోంది. అందులో భాగంగానే పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు ఉచితంగా టీకాలను అందిం చే కార్యక్రమం నిర్వహిస్తోంది. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలి కుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా పశువులు, దూడలకు అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం మార్చి 1వతేదీ నుంచి ప్రారంభించగా 31వతేదీ వరకు నిర్వహిం చేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

● **గాలికుంటు వ్యాధి లక్షణాలు, నష్టం**

ఈ వ్యాధి సోకిన పశువుల నోటి నుంచి తీగల మాదిరి చొంగ కారుతూ ఉంటుంది. తీవ్రమైన జ్వరం, నోరు, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడిపశువులు ఈసుకు పోవడం ఈ వ్యాధి లక్షణాలు. కలుషితమైన గాలి, నీరు, మేత ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన పశువు ద్వారా దాదాపు 90 శాతం పశువులకు ఈ వ్యాధి సంక్ర మించే అవకాశం ఉంది. పాలుతాగే దూడలలో మరణాలు సంభవించే అవకాశం ఉంది. నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయి. ఈ వ్యాధి కారణంగా పాల దిగుబడిలో దాదాపు సగం పాలు తగ్గిపోతాయి.

● **టీకా వల్ల లాభాలు**

వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గేపాల ఉత్ప త్తిని శాశ్వతంగా నివారించవచ్చు. వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామ ర్థ్యాన్ని పూర్తిగా అరికట్టవచ్చు. దూడల్లో మర ణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడు తుంది. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పని సరిగా ఈ టీకా వేయించాలి.

పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో గాలికుంటు, బ్రూసెల్లో సిస్ వ్యాధి నివారణ టీకాల కార్య క్రమం ముమ్మరంగా సాగుతోంది. 6.68 లక్షల గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, 18వేల బ్రూసె ల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడమే లక్ష్యం గా పెట్టుకున్నాం. 4 నుంచి 5 నెలల దూడలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకా అంది స్తారు. 4 నుంచి 8నెలల లోపు ఆడ దూడలకు బ్రూసె ల్లోసిస్ టీకా అందించడం జరుగుతుంది. పాడిరైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- రమేష్ నాయక్, జిల్లా పశుసంవర్థకశాఖ జేడి

బ్రూసెల్లోసిస్ లక్షణాలు

బ్రూసిల్లా అబార్టస్ అనే బ్యాక్టీరియా వల్ల పశువులకు వ్యాపి స్తుంది. ఈ వ్యాధి కి వైద్యం ఉండ దని పశు వైద్యులు చెబుతున్నారు. పశువుల పొదుగు, జననేంద్రి యాలను బ్యాక్టీరియా ఆశించడం వల్ల వ్యాధికి గురవుతాయి. ఈ వ్యాధికి గురైన పశువులకు గర్భ స్రావం జరుగుతుంది. ఈవ్యాధికి గురైన పశువుల పాల వల్ల ఇతర జంతువులకూ వ్యాప్తి చెందుతుంది. పాలను వేడి చేయకుండా తాగడం వల్ల మనుషులకు కూడా వ్యాప్తి చెందుతుంది. నెలల తరబడి తీవ్ర జ్వరం, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. మగ పశువుల్లో వృషణాల వాపులు, కీళ్ల వాపు కనిపిస్తాయి. గుర్తించి వైద్య చికిత్స చేయించుకోవాలి. ఈవ్యాధి రాకుండా 4 నుంచి 8నెలల్లోపు ఉన్న ఆడ దూడలకు ఈ వాక్సిన్ ఉచితంగా అందిస్తున్నారు.

టీకా ఒక్కటే మార్గం

బ్రూసెల్లోసిస్ నివారణకు టీకా ఒక్కటే మార్గం. పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో ఇంటి వద్దే మూడు విడతలుగా ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. 4 నుంచి 8 నెలలు వయస్సు కలిగిన పెయ్య దూడలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి. పాలను బాగా మరిగించి వినియోగించాలి. వ్యాధి బారిన పడ్డ పశువు మిగిల్చిన మేత, గర్భ స్రావ మట్టు, మాయ, పిండాలను గొయ్యి తీసి పూడ్చిపెట్టాలి.

ఇంటర్ పరీక్షలకు 23,821 మంది హాజరు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా బుధవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తం గా జన రల్ విభాగంలో 23,310 మందికి 22,877 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగం లో 986 మందికి 944 మంది హాజరయ్యారు. మొత్తంగా 23,821 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు బాలాజీనగర్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి ప్రశ్నపత్రాలు అందచేసి పలు సూచనలు చేశారు. ఆయన ఏడు కేంద్రా లను, డీవీఈవో 5, డీఈసీ 4, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 24 కేంద్రాలను తనిఖీ చేశాయి. బుధవారంతో లాంగ్వేజ్ పరీక్షలు పూర్తయ్యా యని, గురు వారం నుంచి గ్రూప్ సబ్జెక్టుల పరీక్షలు మొదలవుతాయని ఆర్ఐవో తెలిపారు.

ఓపెన్ ఇంటర్‌కు 2,777 మంది..

ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు బుధవారం జిల్లావ్యాప్తంగా 2,777 మంది హాజరైనట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు తెలిపారు. పరీక్షలకు మొత్తం 3,056 మంది దరఖాస్తు చేసుకోగా 279 మంది గైర్హాజరయ్యా రన్నారు.

పనితీరుని మెరుగు పరుచుకోండి

● విద్యుత్ ఎస్‌ఈ విజయన్



నెల్లూరు,(జడ్పీ), మార్చి 5(ఆంధ్ర జ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రతి ఒక్కరు విధులు నిర్వర్తించాలని, అలసత్వాన్ని వీడి పనితీరు మెరుగు పరుచుకోవాలని విద్యుత్ అధికారులు, సిబ్బందిని ఎస్‌ఈ విజయన్ ఆదేశిం చారు. ఆయన చాంబర్ నుంచి బుధవారం డీఈ, ఏఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అను గుణంగా పని చేస్తూ వినియోగ దారులకు సంతృప్తికరమైన సేవలు అందించాలన్నారు. స్తంభాలకు తీగలు అల్లుకోవడం, పగటిపూట విద్యుత్ దీపాలు వెలగటం వంటివి నివారిం చాలని సూచించారు. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెపై సంబంధిత లైన్‌మన్ ఫోన్ నెంబర్లు రాయాలన్నారు. ఎక్కడ విద్యుత్‌కి అంతరాయం వచ్చినా వెంటనే కార్యాలయానికి తెలియపరిచేలా ఫోన్ నెంబర్లని ఎక్కడికక్కడ ప్రచురించాలని ఆదేశించారు.

పకడ్బందీగా ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు


● కావలిలో డీఈవో నాలుగు కేంద్రాల తనిఖీ



మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు

కావలి, మార్చి5 (ఆంధ్రజ్యోతి) ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంట ర్ పబ్లిక్ పరీక్షలను జిల్లాలో పక డ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీఈవో ఆర్. బాలాజీరావు తెలిపారు. పట్ట ణంలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా, వాటిలో నాలుగు కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. జడ్పీ బాలుర, బాలికల, పాతూరు మున్సిపల్ , 8వ వార్డు మున్సినల్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం డిప్యూటీ డీఈవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో నెల్లూరుతోపాటు కావలి, కందుకూరు, ఆత్మకూ రులోని 20 కేంద్రాలలో ఈ పరీక్షలు జరుగుతు న్నాయని చెప్పారు. ఈ కేంద్రాల్లో 10 సిటింగ్ స్క్వాడ్‌లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు మరో 5 స్క్వాడ్‌లు నిత్యం తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణపై వారికి శిక్షణ ఇచ్చామ న్నారు. కేంద్రంలోకి ప్రవేశించే టప్పుడే విద్యార్థులను తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఒకరి స్థానంలో మరొకరు రాసేందుకు వీలు లేకుండా, అలాంటి వారు ఉంటే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయమని ఆదేశించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఏ రోజు ఏ సెంటర్లకు వెళ్లేది గంటన్నర ముందు మాత్ర మే చెబుతామన్నారు. సిటింగ్ స్క్వాడ్‌లకు కూడా తరచూ సెంటర్లు మారుస్తుంటామని చెప్పారు. ఎక్కడైనా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడి నట్లు తగిన ఆధారాలతో దొరికితే విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, సంబంధిత అధికారు లపై చర్యలు తీసుకుంటామన్నారు.

చికెన్‌గున్యా అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక పరిశీలన



నీటినిల్వలను పరిశీలిస్తున్న వైద్యాధికారి నాగార్జున, వైద్య సిబ్బంది

నెల్లూరు (వైద్యం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగ రంలోని చాకలివీధి ఆరోగ్య కేంద్రం పరిధిలో చికెన్‌గున్యా అనుమానిత ప్రాంతాల్లో మలేరియా నివారణ విభాగం వైద్య బృందం బుధవారం ప్రత్యేక పరిశీలన చేపట్టింది. ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించింది. చికెన్‌గున్యా కేసులు లేవని నిర్ధారించుకున్న అధికారులు స్థానికులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఇంటిలో నీటినిల్వలు ఉంచుకోవద్దని మలేరియా జిల్లా అదనపు అధికారి నాగార్జున హెచ్చరించారు. దీని వల్ల దోమల లార్వా పెరిగే అవకాశం ఉందని, వెంటనేనీటిని ఒలకబోయాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ



నెల్లూరు (హరనాథపురం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బీసీ సం క్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆ శాఖ జిల్లా అధికారి వెంకట లక్ష్మమ్మ తెలి పారు. బుధవారం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో 551 మంది 10వ తరగతి విద్యార్థులున్నారని, వారిని ఏ, బీ, సీ గ్రేడులుగా విభజించా మన్నారు. ఏ గ్రేడ్‌లో 200 మంది, బీ గ్రేడ్‌లో 226 మంది, సీ గ్రేడ్‌లో 132 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. గత ఏడాది ఆగస్టు నుంచి వారికి ప్రత్యేకంగా ట్యూటర్లతో తరగతులు నిర్వహిస్తున్నా మని చెప్పారు. కాగా, జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మొత్తం 3963 మంది బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. విద్యా ర్థులతోపాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు కూడా ముఖ హాజరు విధానాన్ని జిల్లాలో ప్రవేశ పెట్టామన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి అభ్యర్థులకు చెల్లింపుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో చెల్లింపులు చేస్తామని చెప్పారు.

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇవ్వండి

● 48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ

● జిల్లా కలెక్టర్ ఆనంద్

మనుబోలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కోరారు. మను బోలులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని తేమ శాతం యంత్రాన్ని పరిశీలించారు. ఏరకం ధాన్యంకు ఎంతమేర మద్దతు ధర ఇస్తారన్న వివరాల కరపత్రాలను పరిశీలించి వ్యవసాయాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు గురించి తెలియజేయాలని సూచించారు. కల్లం దగ్గరకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులకు తెలపాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు ధాన్యం ఇస్తే 48 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాలకు జమ చేస్తామ న్నారు. కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామన్నారు. 17 శాతం తేమ కలిగిన ధాన్యం ఎంతైనా కొనుగోలు చేసేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎక్కువ మంది రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు మునుపు తహసీల్దారు కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే వీఆర్‌వోలపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య, డీటీ బషీర్ పాల్గొన్నారు.



తేమశాతం యంత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్

ఉపాధి హామీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

డ్వామా పీడీ గంగాభవానీ ● సామాజిక తనిఖీలో రూ. 4.32 లక్షల రికవరీ



సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

చేజర్ల, మార్చి5 (ఆంధ్ర జ్యోతి): ఉపాధి హామీ పథకం లో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పిడి గంగాభవానీ హెచ్చరించారు. బుధవారం చేజర్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రోజు వారీ వేతనం ప్రస్తుతం రూ.254 వస్తుందని, తదుపరి రూ.300 తగ్గకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా ప్రతిరోజు 2500 కూలీలలకు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేజర్ల మండలానికి ఫారమ్ పాండ్స్, ఇంకుడు గుంతలు 300 చొప్పున మంజూరు అయ్యా యని, వీటిని నాలుగు నెలలు లోపల పూర్తిచేయాలన్నారు. అదేవిధంగా మండలంలో జరుగుతున్న క్యాటిల్ షెల్టర్స్ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం 2023-24 లో మండలంలో జరిగిన 1007 పనులకు ఖర్చుచేసిన రూ. 7.59 కోట్ల పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం ప్రజా వేదికలో చదివి వినిపించారు. మండలంలోని 26 పంచా యితీల్లో పనుల్లో జరిగిన లోపాలపై ఉపాధి సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. మం డలంలోని 26 పంచాయితీలకు సంబంధించి మొత్తం రూ. 4.32 లక్షలు రికవరీకి ఆదేశించగా, వీటిలో ఒక్క తిమ్మాయిపాళెం పంచాయితీకి సంబంధించి రూ. 2లక్షలకు పైగా రికవరీ రావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఏపిడి శంకరనారాయణ, డిఈవో విజయనిర్మల, ఎస్క్యుసివో సతీష్‌బాబు, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎంపిడివో విజయలలిత, ఎపివో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 485 మంది గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విక్రమసింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 485 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షకు 48 మంది విద్యార్థులకు 40 మంది హాజరుకాగా 8 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 8,230 మందికి 7,753 మంది హాజరు కాగా 477 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

ప్రసన్న వేంకటేశ్వరుడి హుండీ ఆదాయం రూ.4.12 లక్షలు

బిట్రగుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూటక్షేత్రంలో వెలసి ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి హుండీ లెక్కింపు ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో బుధ వారం నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్స వాలు ఈనెల 9 నుంచి ప్రారంభం కానుం డగా, మూడు రోజులు ముందుగా హుండీ లెక్కింపు చేపట్టారు. పర్యవేక్షణాధికారిగా జీ.రమణారెడ్డి, పాలక మండలి మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి వ్యవహరించారు. 36 రోజులకు గానూ స్వామి, అమ్మవార్లకు భక్తులు అందచేసిన కానుకలు రూ.4,12,510 వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్య క్రమంలో కావలి హెచ్‌డీఎఫ్‌సీబీ బ్రాంచి మేనేజర్ లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	114
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	228
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8307
వెండి కిలో ధర	రూ. 98,300
వెండి ఒక గ్రాము	రూ. 101.30

డిమాండ్ సర్వేలో పేర్లు నమోదు చేయించుకోవాలి

● రావుల మృత్యుంజయ్, హౌసింగ్ ఏఈ



ముత్తుకూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల పక్కా ఇల్లు కోసం తమ పేర్లను డిమాండ్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని హౌసింగ్ ఏఈ రావుల మృత్యుంజయ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.

? లబ్ధిదారులు పక్కా ఇల్లు పొందాలంటే ఎలా.

! ప్రస్తుతం మండలంలో డిమాండ్ సర్వే జరుగుతోంది. లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్‌కార్డులతో పాటు బ్యాంక్ పాసుబుక్‌ను తీసుకుని సచివాలయం లేదా హౌసింగ్ కార్యాలయంలో వివరాలు నమోదు చేయించుకోవాలి.

? గత ప్రభుత్వంలో నిర్మించుకున్న ఇళ్ల బిల్లుల పరిస్థితి ఏమిటి.

! నిర్మాణం పూర్తయిన ఇళ్లకు బిల్లులు మంజూరు అవుతున్నాయి. 2019కి ముందు బేస్మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లకు ఆవాజ్ ఫేస్ పథకం కింద నిధులు మంజూరు చేస్తారు.

? ఎస్సీ, ఎస్టీలకు అదనపు ప్రయోజనాలు కల్పిస్తున్నారా.

! ప్రస్తుత ప్రభుత్వంలో ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, చేనేత కార్మికులకు రూ.50వేలు అదనంగా మంజూరు చేయనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు అందగానే అందుకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేస్తాం.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

ముత్తుకూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర ఇచ్చేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మండల వ్యవసాయ అధికారి జ్యోత్స్నారాణి తెలిపారు. దొరువులపాలెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మండలంలో 9400 ఎకరాల్లో వరి సాగు ఉందన్నారు. పౌరసరఫరాల శాఖ 9 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి కూపన్లు పొందాలని సూచించారు.

పేదల కార్పొరేట్ పాఠశాల 'డీఎస్సార్'

సర్వేపల్లి



మహమ్మదాపురం డీఎస్సార్ జడ్పీ ఉన్నత పాఠశాల

● విద్యా దాత దొడ్ల కుటుంబం ● రూ.కోట్ల వెచ్చించి భవన నిర్మాణాలు
● ఆధునిక వసతులు ● మోడల్ స్కూలుగా రూపాంతరం చెందేనా?

పొదలకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్య, వైద్యం అవసరాన్ని గుర్తించిన దొడ్ల కుటుంబీకులు విద్యాలయాలు, ఆసుపత్రులు నెలకొల్పేందుకు దాతృత్వం చాటుకున్నారు. వారి సంకల్పం వేలమంది పిల్లలను అక్షరాస్యులుగా మలిచింది. అయితే పొదలకూరు మండలం మహమ్మదాపురంలో కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండగా అక్కడి విద్యార్థులు ప్రాథమిక విద్యతోనే సరిపెట్టుకునేవారు. దీనిని గుర్తించిన దొడ్ల కుటుంబం ఆరు దశాబ్దాల క్రితమే డీఎస్సార్ జడ్పీ హైస్కూల్‌ను మంజూరు చేయించి సువిశాల భవనాలను నిర్మించింది. ఈ గ్రామానికి చెందిన దొడ్ల సుబ్బారెడ్డి అప్పట్లో పెద్ద కాంట్రాక్టర్‌గా పేరు గడించారు. హైస్కూల్ లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్న విషయం ఆయన దృష్టికి వెళ్లింది. సుబ్బారెడ్డి సన్నిహితుల వద్ద ప్రస్తావించి తన తండ్రి శేషారెడ్డి పేరుతో గ్రామంలో 5.5 ఎకరాల సొంత మామిడి తోటలో హైస్కూల్‌ను కట్టించారు. బయటి ప్రాంతాల నుంచి సైతం విద్యార్థులు వచ్చి ఇక్కడ విద్యనభ్యసించేందుకు 1962లో పాఠశాలకు అనుబంధంగా మరో మూడెకరాల్లో వసతి గృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడది పేదపిల్లలకు కార్పొరేట్ స్థాయి వసతులతో ఎంతో సౌకర్యంగా ఉంది. దీనిని త్వరలో మోడల్ స్కూల్‌గా మార్చేందుకు కృషి చేస్తామని కలెక్టర్ ఆనంద్ ఇటీవల ప్రకటించారు.



ఈస్ట్ బ్లాక్ హాస్టల్ భవనం

● రూ.75 లక్షలతో పాఠశాల అభివృద్ధి

మహమ్మదాపురం జడ్పీ హైస్కూల్‌లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించేందుకు సుబ్బారెడ్డి మనవడైన దొడ్ల డెయిరీ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ నుంచి అనుమతులు తీసుకున్నారు. డెయిరీ ఆదాయంలో నుంచి 2 శాతం నిధులు సుమారు రూ.75లక్షలను పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేశారు. దీంతో అదనపు గదులు, మరుగుదొడ్లు, భవనానికి పెయింటింగ్, ల్యాబ్ గదికి మరమ్మతులు, పిల్లలకు యూనిఫాం, ఐడీ కార్డులు, బెంచీలు, తరగతి గదులకు తలుపులు, కిటికీలు, బ్లాక్ బోర్డు, వాటర్ ట్యాంక్, బోరు నిర్మాణం పనులు చేశారు.

● చక్కటి హాస్టల్ భవనాలు..

ఆరు దశాబ్దాల నాటి శిథిలమైన భవనాలను కూల్చి దాని స్థానంలో కార్పొరేట్ హాస్టళ్లకు ఏ మాత్రం తగ్గకుండా దొడ్ల శంకరమ్మ ప్రభుత్వ బాలుర వసతి గృహ భవనాలు నిర్మించారు. ఇందుకోసం దొడ్ల శేషారెడ్డి నార్త్ బ్లాక్‌కు రూ.1.60 కోట్లు, సౌత్ బ్లాక్‌లకు రూ.1.50 కోట్లు, ఈస్ట్ బ్లాక్ (మూడు ఫ్లోర్‌లకు) రూ.2.90కోట్లు వెచ్చించారు. ఈస్ట్ బ్లాక్ నిర్మాణ పనులు ఇటీవల పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు.

మోడల్ స్కూల్ ఆలోచనలో కలెక్టర్



అన్ని వసతులు ఉన్న మా పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేస్తామని కలెక్టర్ ప్రకటించడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం 685 మంది విద్యార్థులు ఉండగా 300 మంది హాస్టల్‌లో ఉన్నారు. వారికి ఎలాంటి లోటు లేకుండా దాతలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా పిల్లల కోసం ఫర్నీచర్ ఏర్పాటు చేయించారు.

– చప్పరం రామకృష్ణ, హెచ్ఎం, డీఎస్సార్ జడ్పీహెచ్ఎస్, మహమ్మదాపురం

ముగిసిన శిక్షణ



చెత్త సేకరణ పరిశీలిస్తున్న సైదాపురం కార్యదర్శులు

మనుబోలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వరుసగా 4రోజుల పాటు స్థానిక చెత్తసంపద కేంద్రంలో 4 మండలాల పంచాయతీల సిబ్బందికి, కార్యదర్శులకు చెత్త సంపద కేంద్రం నిర్వహణ గురించి శిక్షణ ఇచ్చారు. చివరి రోజైన బుధవారం సైదాపురం మండలం కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు మండల పంచాయతీ విస్తరణాధికారి నారాయణ కేంద్రం నిర్వహణ, చెత్తసేకరణ, వేరుచేయడం, వర్మికంపోస్టు తయారీ, దానినుంచి సంపద తదితర అంశాలపై అవగాహ న కల్పించారు. అనంతరం మనుబోలులో పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ, వేరుచేసే విధానంపై క్షేత్రస్థాయి పరిశీలన చేయించారు. ఈ కార్యక్రమంలో సైదాపురం ఎంపీ డీవో శివ కుమార్, ఈవోపీఆర్డీ రాఘవేంద్రబాబు పాల్గొన్నారు.

రీసర్వే తప్పులు లేకుండా చేయాలి

● జిల్లా కలెక్టర్ ఆనంద్



రీసర్వేపై పిడూరు రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్

మనుబోలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సర్వే బృందాలు తప్పులు దొర్లకుండా పక్కాగా రీసర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. మండలంలోని పిడూరు రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వేను ఆయన బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. మ్యాప్‌లు, రికార్డుల ప్రకారం ఎవరెవరికి ఎంత భూమి ఉంది, ఎక్కడ ఉంది, ఆభూముల్లో పట్టాదారులే ఉన్నారా, ఇంకెవరైనా ఉన్నారా అన్నది క్షుణ్ణంగా పరిశీలించి చేయాలని సర్వే బృందాలను ఆదేశించారు. సర్వే వద్ద ఉన్న రైతులతో రీ సర్వేపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 38 మండలాలు ఉండగా, 35 మండలాల్లో పైలెట్ కింద ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ భూముల హద్దులు, బ్లాక్‌లుగా విడగొట్టిన భూమి కొలతలు పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం పట్టా భూముల సర్వే జరుగుతోందన్నారు. ఆలస్యమైనా నిదానంగారీసర్వేను పక్కాగా చేయిస్తున్నామన్నారు. రీసర్వే వలన ఏ రైతు నష్టపోకూడదన్నారు. పైలెట్ కింద తీసుకున్న గ్రామాలు పూర్తయిన తరువాత, ప్రజల నుంచి, రైతుల నుంచి ఇంకేమైనా ఫిర్యాదులు వస్తున్నాయా, అభ్యంతరాలు ఉన్నాయా తెలుసుకున్న తరువాత మిగతా గ్రామాల్లోనూ రీసర్వే జరుగుతుందన్నారు. రెండు నెలలుగా తరుచూ రీసర్వేపై జేసీ పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్. సుబ్బయ్య, సర్వేయర్ శ్రీనువాసులు, రీసర్వే డీటీ మంజుల, ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వో శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



రైతులతో మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

విడవలూరు, మార్చి5 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన పంటని దళారులు చేతుల్లో పెట్టి మోసపోవద్దని వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి తెలిపారు. మండల పరిధిలోని విడవలూరు, పార్లపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో సమీక్షించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం 17 ఉంటే పుట్టికి రూ.19,720 ఇస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజిరావు, సుజాత, ఏవో కృష్ణయ్య, సీఈవో దద్దోలు రవి, టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం

● సీపీఎం నేత అంకయ్య

ముత్తుకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బీపీసీఎల్ కంపెనీ నిర్మించనున్న పైపులైన్ల విషయంలో రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోమని సీపీఎం మండల నాయకుడు గడ్డం అంకయ్య హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో రైతులతో చర్చించిన అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు 451 కిలోమీటర్ల పొడవునా పెట్రోలు పైప్‌లైన్లను రూ.1962 కోట్లతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తుందన్నారు. ముత్తుకూరు మండలంలోని పొలాల్లో ఏర్పాటవుతున్న ఈ పైపులైన్‌ను వలన రైతులకు తీవ్రమైన నష్టం కలుగుతుందన్నారు. యాజమాన్యాలు న్యాయమైన పరిహారం కాకుండా భిక్షం వేసినట్లు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవాలనుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోలియం, మినరల్స్ పైప్‌లైన్ చట్టం 1962 ప్రకారం 1962 నాటి రిజిస్ట్రేషన్ వ్యాల్యూతో 10 శాతం నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పడం సబబుకాదన్నారు. పెట్రోలియం కంపెనీ భూసేకరణ చట్టం 2013 ప్రకారం మార్కెట్ విలువ 4రెట్లు అదనంగా చెల్లించాలన్నారు. పైప్‌లైన్‌ను భూమిలో 15 అడుగుల లోపల ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు జరుగుతున్న తీవ్రమైన అన్యాయంపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గిరిజనులకు న్యాయం చేయండి : జనసేన



గిరిజనులతో కలసి పట్టాలు చూపుతున్న జనసేన, టీడీపీ నేతలు

వెంకటాచలం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గిరిజన రైతుల భూములు లాక్కుకొని మోసం చేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకొని బాధిత గిరిజనులకు న్యాయం చేయాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని సర్వేపల్లి పంచాయతీ లింగంగుంట గిరిజన రైతులను బుధవారం టీడీపీ, జనసేన నేతలతో కలిసి విచారించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సర్వేపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా మాజీ మంత్రి కాకాణి అండదండలతో వైసీపీ నేతలు దోచుకున్నారని విమర్శించారు. అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గు తేల్చాలన్నారు. గిరిజనులకు అండగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉంటారని, కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బద్వేలు చెన్నకిష్టయ్య, సమాధి గోవిందు, కుంకాల సుమన్, సాయి, రాము, చెంగయ్య, చిరంజీవి, ఏడుకొండలు, జనసేన నేత సందూరి శ్రీహరి తదితరులున్నారు.

పెద్దరెడ్లని నమ్మితే నిండా ముంచేశారు !

పెద్దరెడ్లని నమ్మితే మా భూములు లాక్కుకొని మమ్మల్ని మోసం చేసి నిండా ముంచేశారని సర్వేపల్లి పంచాయతీ లింగంగుంట గిరిజన రైతులు విమర్శించారు. మండలంలోని సర్వేపల్లిలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ సర్వేపల్లిలో ఏడుగురికి సంబంధించిన 6.21 ఎకరాల భూమికి సంబంధించిన ఒరిజినల్ పట్టాలను వైసీపీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, కోదండరామిరెడ్డి తీసుకున్నారన్నారు. తెల్లకాగితాలపై వేలిముద్రలు, సంతకాలు పెట్టించుకున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

బీపీసీఎల్ కంపెనీకి సహకరించండి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర



మాట్లాడుతున్న బొమ్మి సురేంద్ర

తోటపల్లి గూడూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బీపీసీఎల్ కంపెనీకి రైతులు సహకరించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర తెలిపారు. మండలంలోని తోటపల్లి గూడూరు, సౌత్ ఆములూరు, మెంగళదొరువు, పేడూరు, తోటపల్లి గూడూరు బిట్1, 2 రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రైతుల కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని, బీపీసీఎల్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి ఎకరాకి నష్టపరిహారంగా రూ.4.80 లక్షలు ఇప్పిస్తున్నారని తెలిపారు. రైతులు కూడా కంపెనీకి ఇబ్బందులు కలుగజేయకుండా పైప్‌లైన్‌ల ఏర్పాటుకు సహకరించాలన్నారు. పంట కోత దశలో వారం రోజులు గడువు ఇప్పిస్తామని, అంతేకాని నెలలు గడపరాదని తెలిపారు. మార్చి నెలాఖరు కల్లా పైప్‌లైన్ ఏర్పాటు పూర్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం నాయకులు రావూరి రాధాకృష్ణ నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మన్నెం జితేంద్రగౌడ్, మన్నెం మధుసూదన్ గౌడ్ తహసీల్దారు కృష్ణప్రసాద్, బీపీసీఎల్ కంపెనీ మేనేజరు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపు

తోటపల్లి గూడూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లికార్జునపురం, మాచర్లవారి పాళెంలో శుక్రవారం ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులేని గిరిజనులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐటీడీఏ ప్రాజెక్టు సహకారంతో ఆధార్ క్యాంపు మల్లికార్జునపురం అంగన్‌వాడీలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

కండలేరు నీటిమట్టం 51.31 టీఎంసీలు

రాపూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న కండలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 51.31 టీఎంసీలు ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల మరియు ఇతర కాలువల నుండి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1065 క్యూసెక్కులుగా ఉందని ఆయన తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 835 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 110 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 120 క్యూసెక్కులు చొప్పున 1161 క్యూసెక్కులు నీరు అవుట్ ఫ్లో అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ధర్మల్ బూడిద నీరు రైతులకు శాపం!



ఫౌంటెన్‌లా విరజిమ్ముతున్న లీకేజీ బూడిద నీరు



పైపులైన్ల నుంచి లీకవుతున్న బూడిద నీరు

ముత్తుకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : నేలటూరులోని జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి లీకేజీ అవుతున్న బూడిద నీరు రైతుల కంట కన్నీరు తెప్పిస్తోంది. జెన్కో థర్మల్ కేంద్రం నుంచి వచ్చే ఈ నీటిని పైపులైన్ల ద్వారా సమీపంలో నిర్మించిన యాష్‌పాండ్‌లోకి తరలిస్తారు. సరైన పర్యవేక్షణ, మరమ్మతులు కరువవడంతో లీకేజీకి కారణం అవుతున్నాయి. పైపులైన్లు పగిలి బూడిద నీరు పొలాల్లోకి, రొయ్యల చెరువుల్లోకి, పక్కనే ఉన్న రహదారిపైకి ప్రవహించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతోన్నాయి. సమస్య వచ్చిన ప్రతిసారి జెన్కో అధికారులు స్థానికులకు సర్ది చెప్పడం.. తూతూ మంత్రంగా లీకేజీని అరికట్టడానికి పరిమితమవుతు న్నారు. దీనికి శాశ్వత పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పదే పదే పైపులైన్లు లీకేజీ అవుతున్నాయి. ఈ పైపులైన్ల ద్వారా వెదజల్లే బూడిద నీటి వల్ల పచ్చటి పంట పొలాలు ఎందుకు పనికిరాకుండా వరి పంటకు నష్టం చేస్తున్నాయి. మరోవైపు రొయ్యల చెరువులో ఈ బూడిద నీరు పడి లక్షలు వెచ్చించి చేస్తున్న రొయ్యల సాగుకు నష్టం కలిగిస్తున్నా యి. దీంతో విసిగిపోయిన స్థానిక రైతులు ఈ విషయంపై కాలుష్య ని యంత్రణ మండలి జిల్లా అధికార యంత్రాంగానికి పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఇటీవల వచ్చిన జిల్లా అధికార బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించి బూడిద నీటి వల్ల రైతులు పంట నష్టపోతున్నారని, రొయ్యల చెరు వులకు తీవ్ర నష్టం జరుగుతోందని నిర్ధారించారు. నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగానికి నివేదికలు పంపించారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ధర్మల్ కేంద్రం స్థాపన సమయంలో 18ఏళ్ల కింద వేసిన పైపులైన్లను ఇప్పటి వరకు ఆధునీకరించలేదు. దీంతో ఇవి పదేపదే పగిలిపోయి లీకవుతున్నాయి. ఎప్పటికైనా జెన్కో అధికారులు చర్యలు తీసుకుని కొత్త పైపులైన్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

కావలి పీజీ కళాశాల అధ్యాపకుడిపై విచారణకు త్రిసభ్య కమిటీ

కావలిటౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి) పలు ఆరోపణలు ఎదుర్కొన్న కావలి పీజీ కళాశాల అధ్యాపకుడిపై విచారణకు బుధవారం వీఎస్‌యూ త్రిసభ్య కమిటీని నియమించినట్లు తెలిసింది. పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు మహిళా హాస్టల్‌లో అభివృద్ధి పనులు పరిశీలించాలని, మహిళా బాధ్యురాలి సమక్షంలో కాకుండా ఒంటరిగా హాస్టల్‌లో ప్రవేశించినట్లు అనధికార ఫిర్యాదులున్నాయి. బహిరంగంగా ఫిర్యాదు చేస్తే మార్కుల విషయంలో ఇబ్బంది పెడతారన్న భయంతో విద్యార్థినులు భయపడుతూ అనధికార ఫిర్యాదులు అందించినట్లు తెలుస్తోంది. ఇటీవల సహచర మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ పట్ల కూడా ఆ అధ్యాపకుడు అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వస్తున్న ఆరోపణలపై వీసీ మందలించినట్లు తెలుస్తున్నది. ఆ అధ్యాపకుడి వైఖరిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో వర్సిటీ అధికారులు బుధవారం విచారణకు త్రిసభ్య కమిటీని నియమించారు. నిరంతరం ఏదో ఒక వివాదంతో పీజీ కళాశాల రచ్చకెక్కుతుండడంతో అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

జలాశయంలో యువకుడి మృతదేహం



ప్రభాకర్ మృతదేహం

అనంతసాగరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం ఎగువన నీటిలో బుధవారం ఓ యువకుడి మృతదేహాన్ని జాలర్లు గుర్తించారు. ఈమేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని వెలికితీశారు. మండలంలోని పాతదేవరాయపల్లికి చెందిన బీ ప్రభాకర్ (30)గా గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. లేక ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎర్రచందనం' వాహనం పట్టివేత

● టోల్‌ప్లాజా వద్ద స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వెంకటాచలం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తున్న ఒక వాహనాన్ని బుధవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న మహీంద్రా బొలెరో వాహనంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందింది. దీంతో తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ వాహనాన్ని వెంబడిస్తూ వచ్చారు. వెంకటాచలం సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద స్థానిక పోలీసుల సహకారంతో బొలెరో వాహనాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకెళ్లారు.

యథేచ్ఛగా చికెన్ వ్యర్థాల సరఫరా



స్థానికులు పట్టుకున్న చికెన్ వ్యర్థాల డ్రమ్ములున్న వాహనం

సంగం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపల చెరువులకు చికెన్ వ్యర్థాల సరఫరా యథేచ్ఛగా కొనసాగుతోంది. చికెన్ వ్యర్థాలతో చేపల పెరుగుదల ఉండడమే కాకుండా మేత ఖర్చు బాగా తగ్గుతుండడంతో నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను చేపల చెరువుల్లో వేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో సమీప పొలాల రైతులతోపాటు ప్రయాణికులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అంతేకాకుండా చికెన్ వ్యర్థాలతో పెంచిన చేపలు తింటే క్యాన్సర్ తదితర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చికెన్ వ్యర్థాలను తరలించే వాహనాలను అరికట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

మోసం, వరకట్నం వేధింపులపై కేసు

నెల్లూరు(క్రైం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అంటూ నమ్మించి మోసగించి పెళ్లి చేసుకోవడమేకాక అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తింటి వారిపై చిన్నబజారు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మెక్లీన్స్ రోడ్డుకు చెందిన యువతికి పెళ్లిచేసేందుకు తల్లిదండ్రులు మ్యాట్రిమోనీలో సంబంధాలు చూశారు. విజయవాడకు చెందిన ఆలీఖాన్ అందులో పరిచయం అయ్యాడు. తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని, నెలకు రూ.80 వేలు జీతం వస్తుందని నమ్మించాడు. దీంతో యువతి తల్లిదండ్రులు రూ.15 లక్షల నగదు, 13 సవర్ల బంగారం కట్నకానుల కింద ఇచ్చి పెళ్లి చేశారు. రెండు నెలలు వారి కాపురం సాఫీగా సాగింది. ఆ తర్వాత నుంచి ఆలీఖాన్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. దీనికితోడు అతను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాదని, అమ్మాయిల బ్రోకర్ అని తెలిసి భార్య నిలదీయగా ఆమెపై దాడిచేశాడు. అత్తమామలు, ఆడబిడ్డ సైతం దుర్భాషలాడారు. అదనపు కట్నం కోసం చిత్రహింసలు పెట్టి ఇంటి నుంచి గెంటేశారు. దీంతో ఆమె పుట్టింటికి చేరుకొని జరిగినదంతా కుటుంబ సభ్యులకు తెలిపింది. భర్త, అత్తింటి వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి దుర్మరణం

నెల్లూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జొన్నవాడ - నరసింహకొండ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) డిపోకు చెందిన కార్మికుడు దుర్మరణం చెందాడు. అంది న సమాచారం మేరకు... ఆత్మకూరుకు చెందిన నల్లమేకల మస్తాన్ (35) నరసింహకొండ వద్దనున్న ఐఎంఎల్ డిపోలో హమాలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో దేవరపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్కూటర్ ఆపుకుని మూత్రవిసర్జన చేస్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో స్కూటర్ మస్తాన్‌ను అతివేగం గా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు నెల్లూరుకు తరలి స్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. మస్తాన్‌కు భార్య, ఇద్దరు బిడ్డలున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన ఐఎంఎల్ డిపోలో విషాదాన్ని నింపింది.

వ్యర్థాల రవాణాపై 14 కేసుల నమోదు : సీఐ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరు, చెన్నై రాష్ట్రాల నుంచి చికెన్ వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకుని ఇప్పటి వరకు 14 కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొంత మంది మీడియా, యూట్యూబ్ ఛానల్స్ పేరు చెప్పి చికెన్ వ్యర్థాల వాహనదారులను పోలీసులకు చెబుతామని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి వారిపై నిఘా పెట్టామన్నారు. కొందరి ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. ఇకపై వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమించితే అధిక జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులురెడ్డి ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ లోడ్, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించామని హెచ్చరించారు. బాలికలు, ఈవ్‌టీజ్ చేసేవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.


పట్టుమని 15 ఏళ్లు ఉండవేమో.. పైగా ట్రిపుల్ రైడింగ్


పోలీసు కూడా ఇలా చేస్తే ఎలా?


ఒక్కరికన్నా హెల్మెట్ ఉంటే ఒట్టు!

రూల్స్ మారాయి మిత్రమా..!


కాస్త పక్కన ఆగి మాట్లాడుకుంటే సేఫ్

రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే లక్ష్యంగా మోటార్ వెహికల్ చట్టానికి ప్రభుత్వం మరింత పదునుపట్టి కఠినంగా అమలు చేస్తోంది. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధన విధించింది. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్‌కు విధించే జరిమానాలను భారీగా పెంచింది. పోలీసులు రోజూ కేసులు కడుతున్నారు.. ఫైన్లు వేస్తున్నారు. అయినా... అవగాహన లోపమో లేక నిర్లక్ష్యమోగానీ ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు. నగరంలో ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేసి ఇష్టం వచ్చినట్లు వాహనాలు నడిపేస్తున్నారు. మైనర్లు రయ్..రయ్ మంటూ బండ్లపై దూసుకుపోతున్నారు. ఇది ప్రమాదకరమని తెలిసినా పరివర్తన కనిపించడం లేదు. రూల్స్ మారాయి మిత్రమా.. జాగ్రత్త పడకపోతే జేబుకు చిల్లే!


ఎగ్జామ్ టైం అవుతున్నా.. ముగ్గురు వెళ్లడం తప్పుచిన్నా!

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఎంఎస్ఎంఈ రుణాలకు ప్రోత్సాహం

● లోన్ మేళాలో యూబీఐ జీఎం కామేశ్వరరావు


ఎంఎస్ఎంఈ రుణాల చెక్కును అందజేస్తున్న యూబీఐ జీఎం కామేశ్వరరావు, ఇతర అధికారులు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) రుణాలను ప్రోత్సహిం చడంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ ముందుంటుం దని ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ టీ కామేశ్వరరావు తెలిపారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో యూబీఐ నెల్లూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ఎంఎస్ఎంఈ లోన్ మేళా జరిగింది. ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో రుణాలు పొందడం సులభతర మైందన్నారు. డిజిటల్ లెండింగ్ ద్వారా ఫోన్‌లో ప్రీ అప్రూవ్డ్ రుణాలు పొందవచ్చని వివరించారు. రీజనల్ హెడ్ ఏ రాజశేఖర్ మాట్లాడుతూ దేశంలో ఎంఎస్ఎంఈ ప్రాముఖ్యత, యూపీఐ పాత్రను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 800 మందికిపైగా రుణగ్రహీతలు పాల్గొనగా రూ.100 కోట్లకుపైగా ఎంఎస్ఎం ఈ రుణాలకు సంబంధించి మంజూరు లేఖలు అందజేశారు. ఇందులో రూ.50కోట్ల రుణాలు స్వయం సహాయక సంఘాలకు చెక్ ద్వారా అందిం చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ లోన్ రీజియన్ హెడ్ శిరీష, డిప్యూటీ హెడ్ బీ శివశంకర్, బీ వేణుగోపాల్, బ్రాంచి మేనేజర్లు, డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, మెప్మా పీడీ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘ఐలవ్‌యూ నెల్లూరు’ను జనాల్లోకి తీసుకెళ్తాం

● అన్నిచోట్ల బోర్డులు : నుడా చైర్మన్ కోటంరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(జడ్పీ), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మన ఊరు, మన ప్రాంతాన్ని ప్రతి ఒక్కరు ప్రేమిస్తే అభివృద్ధికి దోహదమవుతుందని, ఈ నేపథ్యంలో ఐలవ్‌యూ నెల్లూరు నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలోని అయన చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నెల్లూరు మీద తనకున్న ప్రేమతో గతంలో నుడా చైర్మన్ కాగానే అందరి సహకారంతో నెక్లస్ రోడ్డుకి శ్రీకారం చుట్టామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నుడా నిధులు దోచుకుని చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారంతో ఎన్టీఆర్ ఘాట్, నెక్లస్ రోడ్డును అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు వ్యాపార సంస్థలు, ఇతర కార్యాలయాలపై ఐలవ్‌యూ నెల్లూరు బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే, ఎమ్మెల్యేల సహకారంతో ప్రతి నియోజకవర్గంలో ఆ నియోజకవర్గం పేరుతో ఐలవ్‌యూ బోర్డుల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

సర్వేలు సమగ్రంగా నిర్వహించండి

● ఎంపీడీవో శైలేంద్రకుమార్

నెల్లూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రభుత్వ నిర్దేశిత సర్వేలన్నీ సమగ్రంగా నిర్వహించాలని నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్ సూచించారు. బుధవారం మండ లంలోని వెల్లంటి, సౌత్ మోపూరు, ములుముడి గ్రామ సచివాలయాల్లోని సర్వే నివేదికలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు విభాగాల కింద అనేక సర్వేలు నిర్వహిస్తున్నామని, వాటిని లోపర హితంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు.

ఆడపిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత


శిక్షణలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఆడపిల్లలు లైంగిక వేధింపులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలు ఎక్కువగా విద్యాలయాల్లోనే లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. బాధితులకు బాలల హక్కుల సంఘం తగిన సహాయం చేస్తుందని వెల్ల డించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్ వలి, స్కూల్ హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ యశ్వంత్, రాష్ట్ర శిక్షకురాలు సుప్రజాదేవి, డీఈఐసీ మేనేజర్ జమీర్ పాల్గొన్నారు.

రోగుల పునరావాస కేంద్రం ప్రారంభం

నెల్లూరు (వైద్యం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో రోగుల పునరావాస కేంద్రాన్ని ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాటాడుతూ వైద్య చికిత్సల అనంతరం వైద్యుల పర్యవేక్షణలో రోగులు త్వరగా కోలుకునేందుకు పునరావాస కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంద న్నారు. ఆసుపత్రి హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, కేన్సర్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ఏ ఆసుపత్రి ఇలాంటి పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ యశ్వంత్ రెడ్డి, నర్సింగ్ హెడ్ శైలజ, మార్కెటింగ్ హెడ్ సతీష్, పీఆర్వో చందు వర్మ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి నేడు పుష్పయాగం

అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి 50 ఏళ్లు



నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి గురువారం పుష్పయాగం జరగనుంది. ఆలయం లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అభిషేకాలు, విశేష నవావరణ పూజలు, పూలంగిసేవ, లలితా సహస్రనామ పారాయణం జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు. ఉభయకర్తలుగా సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పద్మావతమ్మ, వల్లూరు నిషాంత్‌రెడ్డి, స్వాతి, చెన్నూరు శశిధర్‌రెడ్డి, స్వప్న దంపతులు వ్యవహరిస్తున్నారని ఈవో తెలిపారు.

ఆర్టీసీ బస్టాండుకు సోఫా చైర్స్ వితరణ


సోఫా చైర్స్ అందిస్తున్న శ్రీ భగవాన్ మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీ భగవాన్ మహవీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండుకు బుధవారం 15 సోఫా చైర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ బస్టాండ్లలో సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు 1, 2 డిపో మేనేజర్లు మురళి, శివకేశవ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గా ప్రసాద్‌కు ఇంగ్లిష్‌లో డాక్టరేట్


దుర్గా ప్రసాద్

నెల్లూరు (విద్య), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నార్త్ రాజు పాళెం లోని శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్‌గా చేస్తున్న డీ దుర్గా ప్రసాద్ ఫిలాసఫీ ఇన్ ఇంగ్లిష్‌లో డాక్టరేట్ సాధించారు. ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ వీ రవినాయుడు మార్గదర్శకత్వంలో జేమ్స్ బోల్డ్ విన్ నావెల్స్ ఎ స్టడీ ఇన్ థిమాటిక్ కన్సర్న్స్ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. దీంతో ఆయనకు డాక్టరేట్ లభించింది. దుర్గాప్రసాద్‌ను ప్రముఖ న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్ అభినందించారు.

బిల్డింగ్ ప్లానింగ్‌పై రేపు శిక్షణ

● సీపీ పద్మజ

నెల్లూరు(సిటీ), మార్చి 5(ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే ప్లానింగ్ విధివిధానాలపై శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు సిటీ ప్లానర్ పద్మజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ, కావలి, ఆత్మకూరు పురపాలక సంఘాలు, బుచ్చి, అల్లూరు నగర పంచాయతీల పరిధిలోని ప్లానింగ్ అధికారులు, ఎల్‌టీపీలకు ఈ శిక్షణ ఉంటుందని, ఆ రోజున ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. దీనికి లైసెన్స్డ్ ఇంజనీర్లు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని చెప్పారు.

ధనలక్ష్మీపురంలో సీసీ కెమెరాల ప్రారంభం

నెల్లూరు(సిటీ), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను రూరల్ సీఐ వేణు బుధవారం ప్రారంభించారు. దాతల సహకారంతో వీటిని ఏర్పాటు చేశామని చెప్పారు. సీసీ కెమెరాలు అందుబాటులో ఉండటం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని, జరిగిన నేరాలకు ఆధారాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, విజయభాస్కర్, మస్తానయ్య, భాస్కర్ నాయుడు, రవి, పవన్ కుమార్‌రెడ్డి, వెంకట రమణయ్య పాల్గొన్నారు.


సీసీ కెమెరాల ప్రారంభానికి రిబ్బన్ కట్ చేస్తున్న సీఐ వేణు

బర్డ్ ఫ్లూపై రేపు అవగాహన సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలకు బర్డ్ ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నామని, దీంతో పాటు చికెన్ అండ్ ఎగ్ మేళా నిర్వహిస్తున్నట్లు నేషనల్ ఎగ్ కో ఆర్డినేటర్ కమిటీ మాజీ జోనల్ చైర్మన్ ఎన్ బలరామయ్యనాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ, పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్, పౌల్ట్రీ సమాఖ్య పశు సంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు వీఆర్ హైస్కూల్ మైదానంలో జరుగుతుందని తెలిపారు.

8న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సమావేశం నగరంలోని శ్రీ వెంకటేశ్వర విద్యాలయంలో ఈనెల 8వతేదీ సాయంత్రం 5గంటలకు జరుగుతుందని అరసం గౌరవాధ్యక్షుడు పెరుగు రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివ ప్రసాద్ హాజరవుతారని, ఈ సందర్భంగా వేదిక జిల్లా కన్వీనర్, కోకన్వీనర్, సభ్యుల ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

రంగడి ఉత్సవాలకు సమన్వయంతో పని చేయాలి

● అధికారుల సమన్వయ సమావేశంలో ఆర్డీవో వంశీకృష్ణ


సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, పక్కన వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, డీఎస్పీ సింధుప్రియ, ఈవో శ్రీనివాసులురెడ్డి తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకే ప్రతిష్ఠాత్మకమైన తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని నెల్లూరు ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ ఆదేశించారు. బుధవారం సాయంత్రం రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 9 నుంచి 20వతేదీ వరకు జరుగుతాయని చెప్పారు. శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. క్యూలైన్లు, తాగునీరు, పారిశుధ్యం, చలువ పందిళ్లు, ఉచిత ప్రసాదాల పంపిణీలో భక్తులకు లోటురానీకుండా చూడాలని సూచించారు. వేసవి ఎండలు దృష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. భక్తుల భద్రత, ట్రాఫిక్ విషయంలో పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతిశాఖ మూడు షిఫ్టుల్లో సిబ్బంది ఏర్పాటు చేసి ఆలయ ఈవో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, నగర డీఎస్పీ సింధుప్రియ, పాలక మండలి సభ్యులు, పొంగూరు సుబ్బారెడ్డి, రంగాచారి వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే

నెల్లూరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బాలాజీనగర్ సెక్టార్ పాతమిట్టపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే (ఈసీసీఈడే) నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప మాట్లాడుతూ 0-6 వయసున్న పిల్లలు సరైన ఎత్తు, బరువు లేకపోతే పోషణ లోపంగా భావించాలని చెప్పారు. అంగన్‌వాడీల్లో అందచేసే బాలామృతాన్ని చిన్నారు లకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


పోషకాహార కిట్‌ను అందచేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప

మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం

● పవన్‌పై వ్యాఖ్యలకు నిరసనగా..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జనసేన పార్టీ నాయకులు బుధవారం రాత్రి నగరంలోని గాంధీబొమ్మ వద్ద జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీరు మారలేదన్నారు. ఇకపై ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని, లేకుంటే జనసైనికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందర్‌రామిరెడ్డి, గునుకుల కిషోర్ పాల్గొన్నారు.


జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసేన నాయకులు



కాలువ నిండా చెత్తే!

నగరంలోని పంట కాలువలు ప్లాస్టిక్, చెత్తాచెదారాలతో నిండి దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. పంట కాలువలు కాస్త మురికి కాలువలయ్యాయి. ఒక్కొక్క కాలువలో టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోయింది. ఆక్రమణలతో కాలువల రూపురేఖలే మారిపోయాయి. మూలాపేట బట్వాడిపాలెం వద్ద పంట కాలువ ఉందని చెబితేగానీ తెలియని పరిస్థితి. ఆ కాలువ నిండా ప్లాస్టిక్ చెత్త పరుచుకుని ఉంది.

- నెల్లూరు(సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)





అనుభవంలో ఉన్న ఇళ్ల క్రయ విక్రయాలకు అనుమతులివ్వండి

తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం, అవిలాల, సాయినగర్, లింగేశ్వరనగర్‌లో సర్వే నెంబర్ 240, 241, 242, 239-1, 147, 321, 322, 323 నెంబర్లలోని స్థలాల్లో 1975లో రైతుల దగ్గర భూములు తీసుకుని, లేఅవుట్‌లు వేశారు. వీటిలో రెండు వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీరికి ప్రభుత్వం కూడా మౌలిక వసతులు కల్పించింది. కానీ 2001లో హథీరాంజీ మఠం వాళ్ళు లేఅవుట్‌లు వేసిన స్థలాలు తమవని, క్రయ విక్రయాలు జరపరాదని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రాతపూర్వకంగా ఇచ్చారు. దీంతో ఇళ్ల నిర్మాణానికి తుడా అప్రూవల్, బ్యాంకు రుణాలు ఇవ్వడంలేదు. ఈ సమస్యను 2001, 2002లో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు దృష్టికి బాధితులు తీసుకెళ్లగా ఆయన సీసీఎల్‌కు సిఫార్సు చేశారు. అక్కడ్నుంచి తిరుపతి ఆర్డీవో కార్యాలయానికి విచారణ నిమిత్తం ఉత్తర్వులు పంపారు. గత పాలకులు ఆ విచారణ పూర్తి చేయలేదు. దీనివల్ల పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను సత్వరం పరిష్కరించండి.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే



గురుకులంలో మెరుగైన వసతులు కల్పించండి

పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురంలో 23 ఏళ్ల కిందట ప్రారంభమైన అంబేడ్కర్ గురుకుల పాఠశాల.. గడిచిన ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైంది. భద్రత, అవసరాల విషయంలో 540 మంది విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠశాల, హాస్టల్ సదుపాయం ఉంది. ఎక్కువగా ఎస్సీ ఎస్టీ బాలికలు చదువుకుంటున్నారు. ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లను అందుబాటులోకి తీసుకురావాలి. ఇటీవల వర్షాలకు ప్రహరీ కూలిపోయింది. బాలికల భద్రత దృష్ట్యా ప్రహరీని వెంటనే నిర్మించాలి. తాగునీటి సమస్యను పరిష్కరించాలి. అదనంగా నాలుగు తరగతి గదులను నిర్మించాలి. ఇంటర్నెట్‌ను ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలి. బోధన సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి.

- గాలి భానుప్రకాష్, నగరి ఎమ్మెల్యే



సత్యవేడు సీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రి స్థాయికి పెంచాలి

మా నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రివేళ డాక్టర్లు అందుఆటులో ఉండరు. సీహెచ్‌సీలో కాన్పులు చేసేందుకు గైనకాలజిస్ట్ లేరు. దీంతో పేదవాళ్ళు సిజేరియన్ కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి.. రూ.లక్ష ఫీజు కట్టలేక అప్పులపాలవుతున్నారు. అన్ని వసతులున్న సత్యవేడు సీహెచ్‌సీకి మహిళా డాక్టర్‌ను నియమించాలని గత ప్రభుత్వంలో ఐదేళ్లుగా అడిగి అడిగి విసిగిపోయా. 183 పంచాయతీలు, 680 గ్రామాలు, 280 పరిశ్రమలు కలిగిన శ్రీసిటీ సెజ్ ఉన్న మా నియోజకవర్గంలో రాత్రి వేళల్లో డాక్టర్లు అందుబాటులో లేక ఏదైనా ప్రమాదాలు జరిగినా, అత్యవసర పరిస్థితులు వచ్చినా ప్రథమ చికిత్స కూడా అందుబాటులో లేని దుస్థితి. ఎమర్జెన్సీ అయితే చెన్నైకు 60 కిలోమీటర్లు, తిరుపతికి 100 కిలోమీటర్లు వెళ్లాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని పీహెచ్‌సీలలో రాత్రివేళ డాక్టర్లను అందుబాటులో ఉంచాలి. సత్యవేడు సీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రి స్థాయికి పెంచి, గైనకాలజిస్టును నియమించాలి.

- కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే



మెడికల్ మాఫియా చేతిలో ప్రభుత్వ వైద్యం

గత వైసీపీ పాలకులు స్వలాభం కోసం కొన్ని మందుల కంపెనీలతో కుమ్మక్కై శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాలలను మెడికల్ మాఫియా చేతుల్లోకి నెట్టేశారు. దీంతో బయట ఎక్కడా అమ్ముడుపోని మందులను వైద్య కేంద్రాలకు తరలిస్తున్నారు. అవి ప్రజలకు ఉపయోగం లేకపోవడంతో ఎక్స్‌పైరీ అయిపోతున్నాయి. వాటిని నిరుపయోగంగా మార్చి వదలించుకుంటున్నారు. దీంతో పేదలకు అవసరమైన కనీస మందులు లభించని దుర్భర పరిస్థితులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయి. ఇక, ప్రభుత్వ వైద్యులకు కనీస వసతులు లేవు. జ్వరం పరీక్షించే థర్మామీటర, బీపీ పరికరాలు వంటివి కూడా కొన్ని చోట్ల లేవు. మెడికల్ మాఫియా చేతి నుంచి ప్రభుత్వ వైద్యశాలలను రక్షించుకుని ప్రజలకు మంచి వైద్యం అందించాలన్న తపనతో సమస్యను మీముందు ఉంచుతున్నా.

- బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

తిరుపతికి కూత వేటులో ఉండే ఓటేరు చెరువు ఆక్రమణల పర్వం మళ్లీ మొదలైంది. రాత్రికి రాత్రి యంత్రాలను పెట్టి చదును చేస్తున్నారు. పెద్ద ఎత్తున మట్టితోలుతున్నారు. పగలు మాత్రం ఏ అలికిడీ ఉండడంలేదు. ఎవరు చేస్తున్నారనే విషయం కూడా వెల్లడి కాకుండా జాగ్రత్త పడుతున్నారు. దాదాపు వంద కోట్లకుపైగా విలువైన స్థలం ఆక్రమణకు నిశ్శబ్దంగా ప్రయత్నం జరుగుతోందని తెలుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఓటేరు చెరువు చదరం

మట్టి పోసి చెరువును పూడ్చేశారిలా..



కబ్జాకు గురైన ఓటేరు చెరువును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

- రూ.వంద కోట్ల భూమిలో పాగా
- గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో పనులు
- అడ్డుకున్న గ్రామస్తులు ● ఆందోళనకు దిగిన సీపీఐ నాయకులు
- కోర్టులో వివాదం నడుస్తుండడంతో పనులను ఆపిన రెవెన్యూ సిబ్బంది

రాష్ట్రంలో అధికారం మారినప్పుడల్లా ఓటేరు చెరువు ఆక్రమణల అంశం వివాదాస్పదం అవుతూనే ఉంది. పదేళ్ల క్రితం ఓటేరు చెరువులో కొనసాగిన ఆక్రమణల పర్వం అప్పట్లో సంచలనం రేపింది. దీనివెనుక ఓ మాజీ ప్రజాప్రతినిధి ప్రమేయం ఉన్నట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఐదేళ్ల క్రితం రాజకీయ నాయకులకు దగ్గరగా ఉండే ఓ వ్యక్తి దాన సెటిల్‌మెంట్ పేరుతో 80 సెంట్ల భూమిని నెల్లూరు జిల్లా వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడంపై మరోసారి ఈ అంశం భగ్గుమంది. దీంతో పనులు నిలిపివేశారు. ఈ వ్యవహారంలో భాగస్వామ్యమైన రిజిస్ట్రేషన్ అధికారులు విచారణ ఎదుర్కొన్నారు. తాజాగా నాలుగు రోజులుగా కొందరు ఓటేరు చెరువును రాత్రికి రాత్రే చదును చేయడం మొదలుపెట్టారు. ఇది తెలుసుకున్న ఓటేరు గ్రామస్తులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇరువర్గాల మధ్య న్యాయస్థానంలో కేసు నడుస్తున్నందున తీర్పు వచ్చేవరకు వివాదంగా ఉన్న చెరువు స్థలంలోకి ఎవరూ ప్రవేశించకూడదని రెవెన్యూ సిబ్బంది చెప్పి పనులు నిలుపుదల చేశారు.

ఓటేరు వివాదమిదీ

తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ సమీపంలో 1934లో ఓటేరు చెరువు ఏర్పాటైంది. ఆ తర్వాత మెమోలు ద్వారా సర్వే నెం:377లో 17.18 ఎకరాలు ఉన్న చెరువును సబ్ డివిజన్ చేశారు. 377/1లో 7.53 ఎకరాలు, 377/2లో 3.95 ఎకరాలు, 377/3లో 5.70 ఎకరాలుగా విభజించారు. 377/2లోని 3.95 సెంట్లును ప్రజావసరాల కోసం జాతీయ రహదారికోసం వాడుకున్నారు. తక్కిన 377/1, 377/3 సర్వే నెంబర్లు వివాదంలో ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై జలపరిరక్షణ సమితి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఓటేరు చెరువుగల 36.34 ఎకరాల భూమి ఓటేరు చెరువుదేనని 2006లో ప్రభుత్వం నిర్ధారించింది. 13-10-2013న ఏపీ హైకోర్టు సదరు భూమిని ప్రభుత్వ చెరువు భూమిగా ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై హైకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓటేరు చెరువు భూమిగానే నిర్ధారించింది. అయినా ఆక్రమణల ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి.

పరిరక్షణకై పోరాటం: సీపీఐ

ఓటేరు చెరువును మట్టితో పూడ్చిన భూకబ్జాదారులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఓటేరు చెరువును పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి హైవే ఆనుకుని ఉండే ఓటేరు చెరువును అర్ధరాత్రిలో భూకబ్జాదారులు టిప్పర్లతో మట్టితోలి పూడ్చివేస్తున్నారన్నారు. పూడ్చిన వారిపై ఇంతవరకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల విలువ కలిగిన చెరువు భూమిని కాపాడాలని రెండు నెలల క్రితం కలెక్టర్‌ను కలిశామన్నారు. తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు ఎన్ శివ, శ్రీరాములు, విజయ, అలివేలమ్మ, అల్లాభక్షు, రవి, కిషోర్, శ్రీనివాసులు, కార్తీక్ పాల్గొన్నారు.

రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌కు డిగ్రీ విద్యార్థి బలి

- గాయపడ్డ మృతుడి తమ్ముడు అపస్మారక స్థితిలోకి



మృతి చెందిన రవిశేఖర్, అపస్మారక స్థితిలో మునికుమార్

పుత్తూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిలో ద్విచక్రవాహనాన్ని రాంగ్‌సైడ్‌లో వచ్చిన ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా అతడి సోదరుడు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు.సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు...పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీ గట్టు గ్రామానికి చెందిన రైతు మంజునాథ్ కుమారులు మునికుమార్, రవిశేఖర్(18) పుత్తూరులోని వేదవ్యాస కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు.బుధవారం కళాశాలకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు.10 నిమిషాల్లో కళాశాలకు చేరుకోవాల్సిన అన్నదమ్ములను పిల్లారిపట్టు సమీపంలోని వందన వైన్స్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవిశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా,మునికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు.రవిశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మునికుమార్‌ను మెరుగైన వైద్యం కోసం రేణిగుంట సమీపంలోని అమర ఆస్పత్రికి తరలించారు.ప్రమాద సమాచారం తెలుసుకుని వచ్చిన మంజునాథ్ దంపతులు చిన్న కొడుకు రవిశేఖర్ మృతదేహం వద్ద బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది.పెద్ద కొడుకు మునికుమార్ పరిస్థితి కూడా విషమంగా మారడంతో వారు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు.

వ్యతిరేక దిశగా వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్

పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిలో ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ రాంగ్ రూట్‌లో వస్తూ విద్యార్థులు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాద ప్రాంతానికి సమీపంలో ఉన్న క్వారీ నుంచి ముగ్గురాయి తీసుకుని వడమాలపేట వైపు వెళ్లేందుకు జాతీయ రహదారిపై వ్యతిరేక దిశగా డ్రైవర్ గోపి ట్రాక్టర్‌ను నడిపాడు.అతడి వయస్సు 18 సంవత్సరాలు, లైసెన్సు కూడా లేదని సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ నుంచి పరారవడంతో పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు.మరోవైపు కళాశాలకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడేవారని చూసినవారు చెబుతున్నారు.

సీఐఐ తిరుపతి చైర్మన్‌గా జగన్నాథ్



జగన్నాథ్ అనిరుధ్



రాజేంద్రన్

తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తిరుపతి జోన్ చైర్మన్‌గా గంగవరం మండలం గండ్రాజుపల్లెలో వున్న స్విచ్ గేర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథ్ అనిరుధ్ నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా కజారియా సిరామిక్స్ శ్రీకాళహస్తి ప్లాంట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్పీ రాజేంద్రన్ నియమితులయ్యారు. తిరుపతిలో బుధవారం జరిగిన సీఐఐ వార్షిక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ ప్రకటించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.24

సహరి (శుక్రవారం) : 5.07



వెటర్నరీ వర్సిటీ గేట్లకు తాళం

- రోజంతా వీసీ, అధికారులు, ఉద్యోగులు రోడ్డుపైనే పడిగాపులు
- మెస్‌లు, హాస్టళ్ల మూసివేత నిర్ణయంతో విద్యార్థుల సమ్మె ఉధృతం



గోడదూకి లోపలకు వెళ్లేందుకు పోలీసు బలగాల యత్నం



గేట్లకు తాళాలు వేసి, లోపల నిరసన కొనసాగిస్తున్న విద్యార్థులు



ప్రధాన గేటు వద్ద వర్సిటీ వీసీ జేవీ రమణ, ఏఎస్పీ రవిమనోహరాచారి చర్చలు



రోడ్డుపైనే ఉద్యోగుల పడిగాపులు

తిరుపతి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలంటూ ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఉద్రిక్తతకు దారితీసింది. వర్సిటీ ప్రధాన గేట్లకు తాళాలేయడంతో వీసీ సహా అధికారులు, ఉద్యోగులంతా రోడ్డుపైనే ఉండాల్సి వచ్చింది. 31రోజులుగా విద్యార్థులు తరగతులను బహిష్కరించి సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వర్సిటీకి అనుబంధంగా నడిచే మెస్‌లు, హాస్టళ్లను మూసివేస్తూ అధికారులు నోటీసు జారీచేశారు. బుధవారం ఉదయం మెస్‌లను మూసేసినట్లు చెప్పగానే.. వర్సిటీలోకి ప్రవేశించే రెండు ప్రధాన మార్గాలలోని గేట్లకు విద్యార్థులు తాళాలేశారు. తమ లగేజీబ్యాగులు, ప్లేట్లని ముందు పెట్టుకుని లోపల వైపు నిరసన కొనసాగించారు. దీంతో ప్రొఫెసర్లు, ఉద్యోగులు, సిబ్బంది బయట రోడ్డుపైనే నిలబడ్డారు. గేట్లు మూసే అధికారం ఎవరికీలేదని, ఉద్యోగులను లోపలకు అనుమతించాలని ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ సీఐ రామయ్య, సిబ్బంది కోరారు. మెస్‌లను మూసేసి తమను అన్యాయంగా రోడ్డుపైకి చేర్చారని, న్యాయం జరిగేవరకు గేట్లు తెరిచేది లేదని విద్యార్థులు భీష్మించారు. అధికారులు, ప్రొఫెసర్లతో కలసి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ విద్యార్థులతో మాట్లాడారు. స్టైఫండ్ పెంపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికెళ్లగా సానుకూలంగా ఉందని వివరించారు. తాము శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే మెస్, హాస్టళ్లను ఎందుకు మూసేశారని విద్యార్థులు ప్రశ్నించారు. ఎంతకూ విద్యార్థులు గేట్లు తెరవకపోవడంతో ప్రత్యేక బలగాలతో కలిసి పోలీసులు వర్సిటీ గోడపై నుంచి లోపలకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. విద్యార్థులు అడ్డుకున్నారు. దీంతో సాయంత్రం వరకూ రోడ్డుపై, ఫ్లైఓవర్‌కింద వేచి చూసిన ఉద్యోగులు ఆపై వెనుదిరిగారు. కొందరు ఉద్యోగులు వ్యవసాయ కళాశాల మీదుగా వర్సిటీలోకి ప్రవేశించే మార్గానికి చేరుకోగా అక్కడా గేట్లకు తాళం వేసి ఉండటంతో వెళ్లలేకపోయారు.

ఏఎస్పీ సమక్షంలో చర్చలు

వెటర్నరీ వర్సిటీ గేటు వద్దకు ఏఎస్పీ రవిమనోహరాచారి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. చివరకు విద్యార్థులు మూడు ప్రధాన డిమాండ్లను పోలీసుల దృష్టికి తెచ్చారు. ఆయన వీసీని ప్రధానగేటు వద్దకు పిలిపించి విద్యార్థులతో మాట్లాడించారు. హాస్టళ్లు, మెస్‌ల మూసివేత నిర్ణయం వెనక్కితీసుకోవాలని, తమను ప్రభుత్వ పెద్దల వద్దకు చర్చకు తీసుకువెళ్లాలని, సమస్య పరిష్కారమయ్యేవరకు శాంతియుతంగా సమ్మె కొనసాగించనివ్వాలని కోరారు. వీసీ సానుకూలంగా స్పందించడంతో గేట్లు తెరిచారు. కాగా, వీసీ మీడియాతో మాట్లాడుతూ.. అకడమిక్ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇది చాలా విలువైన సమయమన్నారు. సమ్మె విరమించి తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని కోరారు. స్టైఫండ్ పెంపుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో పల్లకీలో ఉత్సవర్ల ఊరేగింపు

వైభవంగా ఏకాంత సేవ

- ముగిసిన ముక్కంటి వార్షికోత్సవాలు



శయన మందిరంలో ఉత్సవర్లు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజైన బుధవారం రాత్రి జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి ఏకాంతసేవ నిర్వహించారు. ఈ ఉత్సవంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉత్సవర్లను మోసుకొచ్చిన చిన్నపల్లకీ స్వామివారి ఆవరణ నుంచి అమ్మవారి శయన మందిరం చేరింది. ఆలయం మూసివేత సమయంలో అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో కూర్చోబెట్టి హారతిచ్చారు. అనంతరం స్వామివారి ఉత్సమూర్తిని అదే పల్లకీలో ఉంచి అమ్మవారి శయన మందిరం వద్దకు తీసుకొచ్చారు. అక్కడి పడక ఊయలలో స్వామి అమ్మవార్లను ఉంచి ఊయల ఊపుతూ ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. స్వామి అమ్మవార్లను ఏకాంతంగా వదిలి అర్చకులు, భక్తులు వెలుపలకు వచ్చి తలుపులు మూయడంతో ఏకాంతసేవ ముగిసింది. ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జెర్రిపోతు

పట్టుబడిన నాగుపాము

వామ్మో!

ఒకే రోజు ఆందోళన పెట్టిన నాగుపాము, జెర్రిపోతు

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలో బుధవారం ఆరు అడుగుల నాగుపాము పట్టుబడింది. గాలిగోపురం వద్ద జనసంచారంలోకి వచ్చిన నాగుపాము భక్తులను ఆందోళన పెట్టింది. సమాచారంతో భాస్కర్ నాయుడు ఘటనా ప్రాంతానికి చేరుకుని దానిని బంధించారు. అలాగే తిరుమల సేవా సదన్‌కు సమీపంలో ఉన్న గార్డెన్‌లోనూ ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతును భాస్కర్‌నాయుడు పట్టుకు న్నారు. ఈ పాములను అడవిలో విడిచిపెట్టారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. శ్రీపాదరాజ మఠాధిపతి సుజయ నిధితీర్థ స్వామిజీ, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఆర్కే రోజా ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సుజయనిధితీర్థ స్వామిజీ - ఆర్కే రోజా - సబితా ఇంద్రారెడ్డి

సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.65 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,861

తలనీలాలు సమర్పించినవారు: 19,639



గురుకులం పిలుస్తోంది

మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పది పాఠశాలల్లో 600 సీట్లున్నాయి. బ్యాక్‌లాగ్ సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. ఈనెల 15లోగా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

ఉమ్మడి జిల్లాలో 10 పాఠశాలల్లో 600 సీట్లు

ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు ఈనెల 15

ఏప్రిల్ 25, 27, 28 తేదీల్లో ప్రవేశ పరీక్షలు

అర్హులు ఎవరంటే?

బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ కేటగిరీలకు చెందిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు. బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థులకు 11, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 12 ఏళ్ల వయో పరిమితిని నిర్దేశించారు. తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించరాదు. పాత జిల్లాల ప్రకారం గురుకుల్లో అడ్మిషన్లు ఉంటాయి.

దరఖాస్తు విధానం

అర్హులు ఆన్‌లైన్‌లో రూ.100 పరీక్ష రుసుము చెల్లించి https://mjapapbcwreis.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, కేటగిరీ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారు. ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 25న, 5వ తరగతి ప్రవేశాలకు 27న, బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి 28న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు.

పాఠశాలలు - సీట్లు

ప్రాంతం	కేటగిరీ	కేటాయించిన సీట్లు
తిరుపతి	బాలికలు	80
పీలేరు	బాలికలు	80
కలికిరి	బాలికలు	80
పెద్దపంజాణి	బాలికలు	40
పులిచెర్ల	బాలికలు	40
సదుం	బాలురు	80
సత్యవేడు	బాలురు	80
ఐతేపల్లి (తిరుపతి)	బాలురు	40
అంగళ్లు	బాలురు	40
కుప్పం	బాలురు	40



తిరుపతిలోని బీసీ గురుకుల పాఠశాల భవనం

సదుపాయాలు : ఉచిత వసతి, పౌష్టికాహారం, మూడు జతల యూనిఫాం, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు లాంటివి ప్రభుత్వం సమకూర్చుతుంది. కాస్మొటిక్ చార్జీలను కూడా చెల్లిస్తుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారు. యోగా, మ్యూజిక్, ఆర్ట్‌లోనూ శిక్షణ ఇస్తారు.

అంబేడ్కర్ గురుకులాలకు నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

ఉమ్మడి జిల్లాలోని 15 అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సర ప్రవేశానికి ఏప్రిల్ 6న పరీక్ష నిర్వహించనున్నారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు గురువారం లోగా దరఖాస్తు చేసుకోవాలి. 5వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు చదువుకోవచ్చు. వసతి, భోజనం, పుస్తకాలు సహా అన్నీ ఉచితమే.

అర్హతలు:

- 5వ తరగతిలో ప్రవేశం పొందగోరు ఎస్సీ, ఎస్టీ బాలికలు 2012 సెప్టెంబరు 1- 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, బీసీ సీ విద్యార్థులు 2014 సెప్టెంబరు 1వతేదీ -2016 ఆగస్టు 31 మధ్య జన్మించినవారై ఉండాలి.
- ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారు జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు అర్హులు.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షకు మించరాదు.

పాఠశాలలు - సీట్లు:

రామకుప్పం, బి. కొత్తకోట, పూతలపట్టు, కుప్పం (విజయపురం)లో బాలుర పాఠశాలలు కాగా శ్రీకాళహస్తి, చిత్తూరు, పీలేరు, బురకాయలకోట, పలమనేరు, సత్యవేడు, పుత్తూరు, మదనపల్లు, కుప్పం, వాల్మీకిపురం, జీడీనెల్లూరుల్లో బాలికల పాఠశాలలున్నాయి. తరగతికి 80 చొప్పున సీట్లు ఉంటాయి. జూనియర్ ఇంటర్‌లో 40, సీనియర్ ఇంటర్‌లో 40 సీట్లున్నాయి.

శాస్త్రోక్తంగా వేద పారాయణం





వేద పారాయణం చేస్తున్న పండితులు - ధూర్జటి కళాప్రాంగణంలో పారాయణం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపును పురస్కరించుకొని బుధవారం ఉదయం వేద పారాయణ సభ శాస్త్రోక్తంగా జరిగింది. ఉత్సవాల్లో చివరి రోజు వేద సభ జరగడం ఆలయ సంప్రదాయం. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రముఖ దేవాలయాల నుంచి 100మంది ఘనాపాటిలైన వేద పండితులు ఆలయానికి విచ్చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఋగ్వేదం, సామవేదం, శుక్ల యజుర్వేదం, కృష్ణ యజుర్వేదం బృందాలుగా పండితులు ఆశీనులయ్యారు. అనంతరం వేదాలను పఠించారు. వేద ఘోషలో ధ్వనించిన దివ్య శబ్ద తరంగాలతో వాయులింగేశ్వర క్షేత్రంలో భక్తులు పరవశించారు. అదే విధంగా ధూర్జటి కళా ప్రాంగణంలో కూడా వేదఘోష జరిగింది. అనంతరం ఈవో బాపిరెడ్డికి వేద పండితులు ఆశీర్వాదం అందజేశారు. వేద సభలో పాల్గొన్న పండితులకు ప్రత్యేక దర్శన ఏర్పాటు తర్వాత ఆలయ లాంఛనాలతో ఘనంగా సత్కరించారు. అలాగే స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం

● మంత్రుల సమీక్షలు సఫలీకృతం ● అధికారుల సమన్వయంపై భక్తుల సంతృప్తి

శ్రీకాళహస్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. గత నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు సాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాల పర్యవేక్షణ కోసం హోం మంత్రి అనిత, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కమిటీ ఏర్పాటు చేయించారు. మంత్రులు స్వయంగా శ్రీకాళహస్తికి చేరుకుని ఎమ్మెల్యే సుధీర్‌తో పాటు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అలాగే కలెక్టర్ పలుమార్లు శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఎప్పటికపుడు సూచనలు చేశారు. ఉత్సవాల దృష్ట్యా నెల రోజుల ముందే సన్నిధి వీధి, రాజగోపురం వద్ద రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే సుధీర్ చేయించారు. అలాగే తిరుపతి రోడ్డులో మరమ్మతులు చేయడం, గిరిప్రదక్షిణ సాగే పట్టణంలోని తెలుగుగంగ కాలనీరోడ్డును బాగుచేయడంతో ఉత్సవాల సందర్భంగా రాకపోకలకు ఇబ్బందులు తగ్గుముఖం పట్టాయి. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పలుమార్లు శ్రీకాళహస్తిలో పర్యటించారు. ఆయన స్వయంగా పట్టణ నలుమూలలో సంచరించి శివారు ప్రాంతాల్లో 11 పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య భక్తులకు దూరమైంది.



ఆలయంలో భక్తుల రద్దీ

ఇక ఎస్పీ, ఈవో బాపిరెడ్డి మహాశివరాత్రి రోజున స్వయంగా క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సామాన్య భక్తులు త్వరితగతిన దర్శనం పొందేలా పగడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఉచిత లడ్డూ ప్రసాదం వితరణ, మహిళలకు వాయనం ఇవ్వడం భక్తులను సంతోష పరిచింది. ఈ యేడాది శివరాత్రి రోజున పెద్దఎత్తున ప్రముఖులు ముక్కంటి ఆలయానికి విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక ధ్వజావరోహణం రోజున తప్ప మిగతావన్నీ సమయపాలనతో సాగడంపై భక్తులు హర్షించారు. మౌలిక వసతులు కూడా భక్తులకు సంవృద్ధిగా ఏర్పాటు చేశారు. మొత్తంగా మంత్రుల సమీక్షలు ఉత్సవాల విజయవంతం కావడానికి బాటలు వేశాయి.

ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రూ.35 లక్షల విలువైన బంగారు, 2116 గ్రాముల వెండి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లుగప్పి దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను తిరుపతి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు రూ.35 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం శివజ్యోతినగర్‌కు చెందిన ముత్తాల అరుణ్, డేరంగుల జగదీష్, ముత్తాల తేజస్, బాలాయపల్లి మండలం వెంగమాంబపురానికి చెందిన అక్కుర్తి నవీన్, అక్కుర్తి పెంచలయ్య, తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంకు చెందిన పి.విఘ్నేష్, బీటీఆర్ కాలనీకి చెందిన లోకనాథరెడ్డి స్నేహితులు. తొలినుంచీ ఈజీ మనీకి అలవాటు పడ్డారు. మద్యానికి బానిసయ్యారు. చెడు అలవాట్లు అలవడటంతో డబ్బు కోసం ఇంటి దొంగతనాల వైపు అడుగేశారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కీలకం. కొన్నేళ్లుగా తిరుపతితో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ దొంగతనాలకు పాల్పడేవారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని పగటి పూట రెక్కీ నిర్వహించేవారు. రాత్రిళ్లు దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో ఫిబ్రవరిలో తిరుపతి రూరల్ తిరుచానూరులోని శంకర్ నాయుడు కాలనీలో ఉంటున్న అంబుజ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. దీనిని గమనించిన ఈ ఏడుగురు.. ఓ రాత్రి వేళ ఇంటి తాళాలు పగులకొట్టి బీరువా, అల్మారాల్లోని అలమరాల్లో వున్న బంగారు నగలు, డబ్బులు, వెండి వస్తువులు అపహరించుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుచానూరు సీఐ సునీల్ అప్పట్లో కేసు నమోదు చేశారు.

నిఘా ఉంచి.. పట్టుకుని

ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ సునీల్‌కుమార్, ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి, అరుణ, జగన్నాథ రెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది ప్రభాకర్, ప్రసాద్, ఎల్‌బీ ప్రసాద్ బృందాలుగా నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో సీఐ సునీల్‌కుమార్ బృందం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ముళ్ళపూడి క్రాస్ వద్ద అనుమానంగా తిరుగుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు శంకర్‌నాయుడు కాలనీలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. వీరి నుంచి దాదాపు రూ.35 లక్షల విలువైన 501 గ్రాముల బంగారు నగలు, 2116 గ్రాముల వెండి ఆభరణాలు, కారు, ఆటో, స్కూటరును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని ముత్తాల అరుణ్‌పై 29 కేసులు, అక్కుర్తి నవీన్‌పై 11 కేసులు, పెంచలయ్యపై 18 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై సస్పెక్ట్ షీట్లు ఉన్నాయి. ఈ ముఠాను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.



దొంగల అరెస్టును చూపి.. మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నేలపట్టులో ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 5(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ఎకో సెన్సిటివ్ జోన్ కోసం మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ అంశంపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ దొరవారి సత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నుంచి 2కి.మీ. విస్తీర్ణాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రభుత్వం గుర్తించిందన్నారు. అక్కరపాకు, మైలంగం, ముచ్చలగుంట, నెలబల్లి, నెల్లూరుపల్లి, వెంగమాంబపురం, ఏకొల్లు, నేలపట్టు తదితర రెవెన్యూ గ్రామాల్లో ఇది ఉంటుందని వెల్లడించారు. పర్యావరణంతో పాటు టూరిజం, వ్యవసాయ, ఉద్యానవనం, మత్స్యశాఖ చేపట్టాల్సిన అంశాలపై చర్చించి మ్యాప్ రూపొందించాలని సూచించారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న ఈ మాస్టర్ ప్లాన్‌లో అధికారులందరూ భాగస్వాములు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట డివిజన్ డీఎఫ్‌వో హారిక, అడిషనల్ డీఎఫ్‌వో నాగభూషణ్, అధికారులు జయచంద్ర, వినోద్, సౌజన్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులపైకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

తమిళనాడుకు చెందిన మహిళ మృతి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5(ఆంధ్రజ్యోతి): బైకుపై వేగంగా వస్తూ అదుపు చేయలేకపోయాడు. కొండకు నడిచి వెళుతున్న భక్తులపైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తమిళనాడుకు చెందిన వీరమ్మాల్(60) మృతిచెందారు. ఈ ఘటన బుధవారం తిరుపతి నగరం ఇస్కాన్ ఆలయం వద్ద చోటుచేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ అజిత తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన చంద్రశేఖర్ బైకుపై అన్నారావు సర్కిల్ మీదుగా ఇస్కాన్ రోడ్డు వైపు వెళుతున్నాడు. అదే సమయంలో తమిళనాడు రాష్ట్రం కాంచీపురం తాలూకా నల్లూరు గ్రామానికి చెందిన వీరమ్మాల్(60) కుటుంబ సభ్యులతో కలిసి నడుచుకుంటూ తిరుమల కొండకు వెళుతున్నారు. ఇస్కాన్ ఆలయం వద్దకు వీరు వెళుతుండగా.. బైకుపై వేగంగా వెళుతున్న చంద్రశేఖర్ అదుపు తప్పి వీరమ్మాల్‌ను ఢీకొన్నాడు. కింద పడటంతో ఆమె తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం రుయాకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



ప్యాసింజర్ రైళ్ల రద్దు 31 వరకు కొనసాగింపు

తిరుపతి(సెంట్రల్), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కుంభమేళా కోసం రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లలో కొన్నింటిని ఈనెల 8 నుంచి 31వ తేదీ వరకు, మరికొన్నింటిని 17వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. తిరుపతి-కదిరి దేవరపల్లి (57405-57406), తిరుపతి-గుంతకల్లు(57403-57404), తిరుపతి-హుబ్లీ (57401-57402) మధ్య రాకపోకలు సాగించే రైళ్లను ఈనెల 31 వరకు, తిరుపతి-కాట్పాడి మధ్య నడిచే ఆరు డెము ప్యాసింజర్లను ఈనెల 17వ తేదీ వరకు రద్దు చేస్తున్నామని వివరించారు.

హెల్మెట్ లేకుంటే నో ఎంట్రీ



అపాచీ పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

తడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వినియోగంపై పరిశ్రమలు సైతం వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం తడలోని నిప్పో పరిశ్రమ యాజమాన్యం హెల్మెట్ ధరించని ఉద్యోగులను లోనికి అనుమతించేది లేదంటూ నిబంధన విధించిన విషయం తెలిసిందే. తాజాగా మాంబట్టు సెజ్‌లోని అపాచీ పరిశ్రమ ఈనెల 17నుంచి హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంలో విధులకు వచ్చే ఉద్యోగులను లోనికి అనుమతించేది లేదంటూ బోర్డు ఏర్పాటు చేసింది.

ద్వితీయ ఇంటర్ పరీక్షలకు 540 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 540 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆంగ్ల భాష పరీక్ష జరిగింది. 29,131 మంది విద్యార్థులకు గాను 28,591 మంది పరీక్షలు రాశారు. 540 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్‌ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

ఎస్వీయూ దూరవిద్య పీజీ నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ దూరవిద్యా పీజీ నోటిఫికేషన్ విడుదలైంది. 2025 సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్ బాబు తదితరులు బుధవారం విడుదల చేశారు. 17 పీజీ, 2 డిప్లొమో కోర్సులకు ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎల్‌ఐఎస్‌సి కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువరించామన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచీ 25వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్వీయూసీడీఓఈ.ఏసీ.ఇన్.. వెబ్‌సైట్ చూడాలని కోరారు. సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంద్రాయుడు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ వరదరాజన్ తదితరులు పాల్గొన్నారు.



జయంపులో పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు



బాలాయపల్లి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్

బాలాయపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి) మండలంలోని జయంపులో పీహెచ్‌పీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తెలిపారు. ఈ నెల ఒకటవ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన జయంపులో పీహెచ్‌సీ ఏర్పాటయ్యేనా అన్న కథనానికి ఆయన స్పందించారు. బుధవారం జయంపులో పీహెచ్‌సీ ఏర్పాటుకు ఒక గదిని పరిశీలించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి గర్భిణుల నమోదు, ఓపీ తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ల్యాబ్, వార్డు, ప్రసవాల గదులను పరిశీలించారు. కొన్ని గదుల్లో శ్లాబ్ పెచ్చులూడుతుండడాన్ని గుర్తించిన ఆయన మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లిఖిత, లియోనా పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం

కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యంతో పాటు రోగులకు అధునాతన వసతులు కల్పిస్తున్నామని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తెలిపారు. కోట మండలం చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ల్యాబ్‌లు, బెడ్‌లను, సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నాగరాజుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ



నిడిగుర్తి ప్రభుత్వాస్పత్రిలో మహిళా సిబ్బంది మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ

వాకాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం, నిడిగుర్తి ప్రభుత్వాస్పత్రుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ బుధవారం విచారణ చేపట్టారు. బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రి పరిధిలోని దళితవాడకు చెందిన చరణ్ ఇటీవల పాముకాటుతో మృతిచెందిన ఘనటపై పలువురు ఫిర్యాదు చేశారు. అలాగే నిడిగుర్తి ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రామకృష్ణపై మహిళా సిబ్బంది ఫిర్యాదు చేశారు. దీంతో ఆయా ఆస్పత్రుల్లో సూపర్‌వైజర్లు నరేష్‌బాబు, హిదైతుల్లా బృందంతో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ విచారణ చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కి నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఏఆర్ ల్యాబ్ ద్వారా మెరుగైన బోధన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆగ్మెండెట్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ ల్యాబ్ ద్వారా మెరుగైన బోధనను అందించవచ్చునని గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో ఆగ్మెండెట్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గణితం, సైన్స్ విభాగాల్లో హోలో క్యూబ్స్ ద్వారా కష్టమైన అంశాలను ఆసక్తికరంగా, సులభతరంగా నేర్చుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ యుగంలో విద్యార్థులకు సాంకేతికతో కూడిన బోధన ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఇంద్రాణి, రాజు, ఆంజనేయులు, ఇమ్రాన్, శ్రీహరి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తమ్మినపట్నం, కొత్తపట్నంలో గ్రామసభలు

చిల్లకూరు, కోట మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని తమ్మినటపట్నం, కోట మండలంలోని కొత్తపట్నం సచివాలయాల్లో గురువారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు శ్రీనివాసులు, జయజయరావు తెలిపారు. చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ ప్రాజెక్టుకు భూములకు నష్టపరిహారం పొందడానికి లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో వెల్లడించడం జరుగుతుందన్నారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 7 రోజుల లోపు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తగిన ఆధారాలతో తెలియజేయాలని తహసీల్దారు సూచించారు.

శాసనసభ అంచనాల కమిటీ సమావేశంలో పాశిం

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన బుధవారం విజయవాడలో శాసనసభ అంచనాల కమిటీ, ప్రజాపద్దుల కమిటీ, ప్రభుత్వ సంస్థల కమిటీ సమావేశాలు జరిగాయి. అంచనాల కమిటీలో సమావేశంలో సభ్యుడైన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మన్నారుపోలూరు ఆలయ భూముల వేలం

సూళ్లూరుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మన్నారుపోలూరు కృష్ణస్వామి ఆలయ భూములకు రెవెన్యూ, టీటీడీ అధికారుల సమక్షంలో బుధవారం వేలం పాటలు నిర్వహించారు. ఆలయానికి సంబంధించి ఇలుపూరు, నూకలపాలెం, మన్నెముత్తేరి గ్రామాల్లో 20.80 ఎకరాల భూములున్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, సర్వేయర్ బాలాజి, వీఆర్వోలు శ్రీదేవి, హైమావతి పాల్గొన్నారు.

అర్హులైన వారికి బీసీ కార్పొరేషన్ రుణాలు

నాయుడుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అన్నివిధాలుగా అర్హులైన వారికి బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరవుతాయని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు అందిన దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలించారు. మండలానికి 26 యూనిట్లు మంజూరు కాగా 219 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ప్రభుత్వ సర్వేలను వేగవంతంగా నిర్వహించాలి

నాయుడుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 9 సర్వేలను వేగవంతంగా, సంపూర్ణంగా నిర్వహించిన నివేదకలు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. బుధవారం పలు సచివాలయాలను తనిఖీ చేశారు. సర్వేలను నిర్లక్ష్యం చేస్తే నోటీసులు జారీ చేస్తామన్నారు.



బేరిపేట సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ఫజులుల్లా

కొండూరు చెరువులో యువతి మృతదేహం

తడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మాంబట్టు సెజ్ రోడ్డు సమీపంలోని కొండూరు చెరువులో ఓ యువతి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెరువులో మృతదేహం తేలియాడుతున్నట్లు స్థానికుల నుంచి బుధవారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ కొండప్పనాయుడు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఒరిస్సా రాష్ట్రానికి సంబంధించి ఓ బట్టలషాపు కవరు, అందులో కొన్ని దుస్తులు తప్ప ఇతర ఆధారాలు దొరకలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. 20నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉంటుందని, కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో మూడు, నాలుగు రోజుల క్రితం యువతి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతదేహంపై ఎటువంటి గాయాలు కనిపించలేదని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కొండప్పనాయుడు తెలిపారు. ఘటనా స్థలాన్ని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ కూడా పరిశీలించారు.

10న పెన్షనర్ల సమావేశం

గూడూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 10వ తేదీన పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు మెహబూబ్ బాషా బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు బొల్లినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. పెన్షనర్లు హాజరై వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమతి లేకుండానే లేఅవుట్ నిర్మాణం

స్థలాన్ని వ్యవసాయేతర భూమిగా మార్చకుండానే పనులు ● నోటీసులతో సరిపెట్టిన అధికారులు





అక్రమ లేఅవుట్‌లో చేపట్టిన రోడ్ల నిర్మాణం

సూళ్లూరుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం ఇటు చెన్నై అటు నెల్లూరుకు మధ్యలోనే కాకుండా పారిశ్రామివాడలకు దగ్గరగా ఉండడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో కొందరు అనుమతి లేకుండా లేఅవుట్లు వేసి క్రయవిక్రయాలు చేసేస్తున్నారు. వీరికి కొందరు అధికారులు, నేతలు సహకరిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు అడ్డే లేకుండాపోవడంతో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుల్లా వెలిశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అందరూ భావించారు. అయితే అందుకు భిన్నంగానే సాగుతోంది. సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డున అనుమతులు లేకుండా లేఅవుట్ వేసి కాలువలు, రోడ్ల నిర్మాణం చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని చిన్నసత్రం ఆనుకోని సూళ్లూరు జప్తు కట్టుబడి రెవెన్యూలో సర్వే నంబరు1-1బిలో 0.45 సెంట్లు, 1-2ఏలో 0.40 సెంట్లు, 1-5లో 0.52 సెంట్లతో కలిపి మొత్తం 1.37 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. దీనికి వ్యవసాయేతర భూమిగా మార్పు చేయకుండా లేఅవుట్ వేశారు. ఇందులో కాలువలు, రోడ్లను నిర్మిస్తున్నారు. లేఅవుట్ వేయాలంటే ముందస్తుగా సదరు స్థలాన్ని వ్యవసాయేతర భూమికి మార్పు చేయాలి. ఇందుకు సంబంధిత తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాక ఆర్డీవో సదరు భూమిని పరిశీలిస్తారు. స్థలం విలువను బట్టి చలానా చెల్లించాక భూమార్పిడి జరుగుతుంది. సూళ్లూరు జప్తు కట్టుబడిలోని 1.37 ఎకరాల స్థలం ఇంకా వ్యవసాయ భూమిగానే రెవెన్యూ రికార్డుల్లో ఉంది. అంటే నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేసినట్లు స్పష్టమవుతోంది. గత ఏడాది డిసెంబరులోనే ఈ లేఅవుట్ వేసేందుకు భూమిని చదును చేసి పక్కనే ఉన్న లేఅవుట్‌లోకి రోడ్డును అనుసంధానం చేసి సైడ్ కాలువలు నిర్మించారు. అప్పట్లో అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం లేఅవుట్‌లో రోడ్ల నిర్మాణంతో పాటు, ఇతర పనులు వేగంగా జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమీ సంబంధం లేదనట్లుగా ఉంటున్నారు.

కాళంగి వంతెన, గ్రాయిన్ నిర్మాణానికి నిధులు కేటాయించండి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

తడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయం సమీపంలో కాళంగి నదిపై ఉన్న వంతెన పునఃనిర్మాణానికి, అదేవిధంగా కాళంగి గ్రాయిన్‌కు నిధులు కేటాయించి పనులు పూర్తయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. మంగళవారం అమరావతిలోని శాసనసభ ప్రాగణంలో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కలిశారు. ప్రస్తుతం ఉన్న వంతెన బ్రిటీష్ కాలం నాటిదని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని పునఃనిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు రూ.35 కోట్లు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అదేవిధంగా పులికాట్ సరస్సులోని ఉప్పునీరు కాళంగి నదిలో కలిసిపోకుండా తడ మండలం వాటంబేడు వద్ద గ్రాయిన్‌ను నిర్మించాల్సి వుందని, ఇందుకు రూ.23 కోట్లుతో నివేదికలు తయారయ్యాయని చెప్పారు. స్పందించిన సీఎం పరిశీలించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కూడా సీఎంను కలిశారు.

బైక్‌లో మంటలు



సూళ్లూరుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం బాపూజీ వీధిలోని ఓ దుకాణం ముందు పార్కింగ్ చేసిన పల్సర్ బైక్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు... తడ మండలం బీములవారిపాలెం గ్రామానికి చెందిన ప్రతాప్ స్నేహితుడితో కలిసి బుధవారం సూళ్లూరుపేటకు పల్సర్ బైక్‌లో వచ్చారు. బాపూజీ వీధిలోని ఓ దుకాణం ముందు ఆపి గిఫ్ట్ కొనుక్కునేందుకు వెళ్లారు. ఇంతలో బైక్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలను ఆరిపేందుకు ప్రయత్నించినా 90 శాతానికి పైగా కాలిపోయింది.

మండలాభివృద్ధికి నిధులివ్వండి



మంత్రి ఆనంతో టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 5 (ఆంధ్రజోతి): మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని పెళ్లకూరు మండలానికి చెందిన టీడీపీ నేతలు బుధవారం అమరావతిలో కలిశారు. మండలాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, నాయకులు మదన్‌మోహన్ నాయుడు, మాడుపూరు మురళీ నాయుడు ఉన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14వ తేదీన జరగనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. బుధవారం గూడూరులోని జనసేన కార్యాలయంలో ఛలో పిఠాపురం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మోహన్, వంశీకృష్ణ, కుమార్, సాయికిరణ్, పెంచలయ్య, సుమన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

గూడూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఆ శాఖ ఈఈ నరేంద్రరెడ్డి అన్నారు బుధవారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద లైన్‌మెన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను లైన్‌మెన్‌లు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం నూతనంగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం మార్పులపై అవగాహన పెంచుకుని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, శేషాద్రి, భాస్కర్, శ్రీహరిబాబు, ఏడుకొండలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ వ్యవస్థాపకుడికి నివాళి

సూళ్లూరుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఎన్ఎంయూ వ్యవస్థాపకుడు రామ్మోహన్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు శేఖర్, పోలయ్య, సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, భాస్కర్, షాజహాన్, సుబ్బయ్య, శశిధర్, మాధవ్ పాల్గొన్నారు.

సర్వేలను పక్కాగా నిర్వహించాలి

తడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను పక్కాగా నిర్వహించాలని జిల్లా సచివాలయ అధికారి నరసింహారెడ్డి అన్నారు. బుధవారం తడకండ్రిగ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన సమయానికి సర్వేలన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తళా గాబ్రియేల్, మస్తాన్, శేషారావు, పద్మా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



వెండిచీర అలంకారంలో రాజరాజేశ్వరీదేవి

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరిదేవి ఆలయ పదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి గణపతి పూజ, హోమపూజలు, కుంకుమార్చన పూజలు చేశారు. అమ్మవారిని వెండిచీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం చేపట్టి అమ్మవారికి వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఏలూరు వరదారెడ్డి, ఇంద్రసేనా మంజునాధరెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, కొండూరు కోదండరామయ్య, సుబ్రహ్మణ్యం దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నేతలు



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, మాధవనాయుడు తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బుధవారం అమరావతిలో కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెపూడి పంచాయతీలోని లక్ష్మక్కకండ్రిగలో బుధవారం కుక్కల దాడిలో జింక మృతిచెంది. కేశవరం అటవీ ప్రాంతంలోని జింక దాహార్తిని తీర్చుకునేందుకు లక్ష్మక్కకండ్రిగ పొలాల్లోకి వచ్చింది. కుక్కలు వెంబడించి దాడి చేయగా రక్తగాయాలతో స్థానిక కూటాలమ్మ దేవాలయం వద్ద పడిపోయి మృతిచెందింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం తీసుకువెళ్లారు.

పేదలకు దుస్తుల అందజేత

గూడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో బుధవారం విష్ణువర్ధన్ దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం రెడ్ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణమ్మ, విష్ణువందన, తనూజ, స్నేహలత, లక్ష్మి, జానా సుధీర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో పూడికతీతను అడ్డుకున్న గ్రామస్తులు

నాయుడుపేట/పెళ్లకూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కలవకూరు వద్ద స్వర్ణముఖినదిలో చేపట్టిన పూడికతీత పనులను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలోని కోట మండలం గూడలి, పెళ్లకూరు మండలం దిగువ కలవకూరు, పుల్లూరు స్వర్ణముఖిది ఆనకట్టకు ఎగువ, దిగువ ప్రాంతాల్లో పూడికతీతకు ప్రభుత్వం ఇటీవల టెండర్లు పిలిచింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ దిగువ కలవకూరు వద్ద వాహనాల రాకపోకలు జరిగేలా తాత్కాలిక రోడ్డును వేసి మంగళవారం పనులు ప్రారంభించారు. ప్రభుత్వ నింబంధనల ప్రకారం మనుషులతో పూడికతీత చేపట్టాల్సి ఉండగా యంత్రాలతో పనులు ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న రైతులకు సంబంధించిన సాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఇది గమనించిన రైతులు బుధవారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పూడికతీతకు పనులను అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ పనులను ఆపేశారు.

కమనీయం... సీతారాముల కల్యాణం



స్వామి, అమ్మవార్లకు వివాహం జరిపిస్తున్న వేదపండితులు

కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో బుధవారం సీతారామధార్మిక సంస్థ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిగింది. స్థానిక సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రవాస భారతీయులు వెంకట్రామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల సహకారంతో కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణ తంతును వేద పండితులు అనంతాచార్యులు, సాయిబాబా, నరేష్ కళ్లకు కట్టినట్టు చూపించారు. కార్యక్రమంలో అల్లం రమణయ్య, శరవణ, బాలాజీ, సుబ్రమణ్యం, అన్నపూర్ణా తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి



ఇంటి పన్ను వసూలు కార్యక్రమంలో డీఎల్పీవో వెంకటరమణ, ఎంపీడీవో మనోహర్ గౌడ్ తదితరులు

చిట్టమూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ కోరారు. బుధవారం మండలంలోని మల్లాం గ్రామంలో ఇంటి పన్ను వసూలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లించడం వల్ల పంచాయతీల్లోని మౌలిక వసతులు కల్పనకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, గూడూరు డివిజన్ రిసోర్స్ పర్సన్ రవి, ఇన్‌చార్జి ఇవోపీఆర్డీ జనార్దన్, సీనియర్ అసిస్టెంట్ జనార్దన్, మల్లాం పంచాయతీ కార్యదర్శి ఆనందయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాలి

నాయుడుపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కనీస సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుందా డిమాండ్ చేశారు. నాయుడుపేట మండలం చిగురుపాడులో ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. కూలీలకు పనిముట్లు అందించలేదని, తాగునీరు, విశ్రాంతి తీసుకునే సదుపాయం లేనట్లు గుర్తించారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు అందజేయాలన్నారు.

పీ-4 సర్వేని విజయవంతంగా నిర్వహించాలి

వాకాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పీ-4 సర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని నిడిగుర్తి సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీ-4 సర్వే(పబ్లిక్, ప్రైవేటు, ఫీపుల్ పార్ట్నర్‌షిప్) ద్వారా అత్యంత పేదరికం కలిగిన 20శాతం మందిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ మస్తానయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళా దినోత్సవం

కోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెం, ప్రకాశం కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ పిల్లల్లో పోషణ లోపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా బాల్య వివాహాల నిర్మూలన, ప్రతి ఆడపిల్ల చదవాలి అనే నినాదాలతో ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు కవిత, ఆర్‌వీరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని సరిదిద్దేది మహిళలే

డక్కిలి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటితో పాటు సమాజాన్ని సరిదిద్దేది మహిళలేనని సీడీపీవో షంషాద్ బేగం అన్నారు. బుధవారం డక్కిలిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, హక్కులు, విద్య, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీవో జమునారాణి, ఎస్‌ఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.